


# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి శుక్రవారం 28 జనవరి 2022 సంపుటి : 03 సంచిక : 147 పేజీలు : 4 వెల : రూ 3-00


## కోవిడ్ నివారణ చర్యలపై సీఎం జగన్ సమీక్ష



తాడేపల్లి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కోవిడ్ నివారణ చర్యలపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో కరోనా చికిత్స, వాక్సినేషన్‌పై సీఎం జగన్ సమీక్షించారు. అన్ని జిల్లాల్లో పూర్తిస్థాయిలో వ్యాక్సినేషన్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సమీక్ష సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కోవిడ్ కేర్ సెంటర్లలో ఉన్నవారికి మంచి సదుపాయాలు ఇవ్వడంతో పాటు ఆస్పత్రుల్లో చేరుతున్నవారిలో అర్హులైన అందరికీ కూడా ఆరోగ్యశ్రీ కింద చికిత్స పూర్తిస్థాయిలో అందించాలన్నారు.కోవిడ్ చికిత్సలో భాగంగా అనుసరించాల్సిన విధానాలపై ఎప్పటికప్పుడు అడ్వైజరీస్ ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ, ఈహెచ్ఎస్ అమలు తీరు దేశం మొత్తం మాట్లాడుకునేలా ఉండాలని, విప్లవాత్మక చర్యగా మనం ఆరోగ్యశ్రీని అమలు చేస్తున్నామని తెలిపారు. బీమా సంస్థలు రేట్లకన్నా.. ఆరోగ్యశ్రీ కింద చికిత్సలకు మంచి రేట్లు చెల్లిస్తున్నామని, జీఎంపీ ప్రమాణాలున్న మందులనే మనం ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఇస్తున్నామన్నారు. రాష్ట్రంలో చేపడుతున్న అనేక కార్యక్రమాలు కాలక్రమేణా దేశానికి తప్పనిసరిగా ఆదర్శనీయంగా నిలుస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.కనీసం 8?10 రోజులు క్షేత్రస్థాయిలో ఉండి ఆరోగ్యశ్రీ అమలుపై ఆరా తీయాలని ఆరోగ్యశ్రీ సీఈఓకి ఆదేశించారు. క్షేత్ర స్థాయి పరిశీలనలద్వారా ఆరోగ్యశ్రీ మరింత బలోపేతం చేయాలని సీఎం జగన్ సూచించారు. రాష్ట్రంలో కోవిడ్ విస్తరణ పరిస్థితులను వివరించిన అధికారులుకేసులు నమోదు అవుతున్నా ఆస్పత్రిలో చేరాల్సిన అవసరం ఉన్నవారి సంఖ్య చాలా స్వల్పంగా ఉందని తెలిపిన అధికారులు ఆస్పత్రుల్లో చేరుతున్నవారు కూడా దాదాపు చికిత్సతో కోలుకుంటున్నారని తెలిపిన అధికారులు క్రమంగా పాజిటివిటీ రేటు కూడా తగ్గుముఖం పడుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయన్న అధికారులు 1.06లక్షలకుపైగా కేసుల్లో కేవలం 2709 మందే ఆస్పత్రుల్లో చేరారని తెలిపిన అధికారులు ఇందులో ఐసీయూలో చేరిన వారు కేవలం 287 మంది మాత్రమేనని దాదాపుగా వీళ్లుకూడా కోలుకుంటున్నారని తెలిపిన అధికారులు ఆస్పత్రుల్లో చేరినవారికి కూడా 93శాతం మంది ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స పొందుతున్నారని తెలిపిన అధికారులు 18 ఏళ్ల పైబడ్డ వారికి 90.34 శాతం మందికి రెండు డోసుల వాక్సినేషన్ పూర్తయ్యిందన్న అధికారులు 15 నుంచి 18 ఏళ్ల మధ్యనున్నవారికి 98.91శాతం మొదటి డోస్ పూర్తయ్యిందన్న అధికారులు

## శ్రీ సిటీలో ఆక్సిజన్ ప్లాంట్‌ను ప్రారంభించిన సీఎం జగన్






అమరావతి: శ్రీ సిటీలో ఆక్సిజన్ ప్లాంట్‌ను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్‌గా ప్రారంభించారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో నోవా ఎయిర్ ఎండీ గజనన్ నబర్, కమర్షియల్ హెడ్ శరద్ మథోక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ.. 14 నెలల్లోప్లాంట్ ప్రారంభం కావడం ఒక మైలురాయి అని కొనియాడారు. 220 టన్నుల ఆక్సిజన్ తయారీ చేయడం చాలా ముఖ్యమైన విషయమన్నారు. 144 పీఎస్ఏ ప్లాంట్లు కూడా వివిధ ఆస్పత్రుల్లో పెట్టామని, మరో 32 ప్లాంట్లు కూడా పెడుతున్నామని పేర్కొన్నారు. దీనివల్ల ఆక్సిజన్ విషయంలో మౌలిక సదుపాయాలు మెరుగుపడ్డాయని, 24వేల ఆక్సిజన్ బెడ్లు తయారు చేశామని సీఎం జగన్ అన్నారు. కోవిడ్ లాంటి విపత్తులు వచ్చినప్పుడు సరిపడా ఆక్సిజన్ అందుబాటులోకి వస్తుందని ముఖ్యమంత్రి తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటివరకూ 300 టన్నుల ఆక్సిజన్ తయారీలో ఉందని, ఈ ప్లాంట్ ద్వారా ఉత్పత్తి దీనికి అదనంగా వచ్చిచేరుతుందని పేర్కొన్నారు.కోవిడ్‌కే కాదు, పరిశ్రమలకూ ఆక్సిజన్ చాలా ముఖ్యమని నోవా ఎయిర్ ఎండీ గజనన్ నబర్ తెలిపారు. దేశంలో తొలిసారిగా ప్లాంట్‌పెట్టామని ఇందుకు ఏపీ సరైనదని ఎంచుకున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో మంచి మౌలిక సదుపాయాలు ఉన్నాయని, 14 నెలల్లో ప్లాంట్‌ను నిర్మించామని తెలిపారు. అధికారులు, ప్రభుత్వ యంత్రాంగం బాగా సహకరించిందని చెప్పారు. కోవిడ్ వేవ్‌ల సమయంలో రవాణాకు, మానవవనరులకు కొరత లేకుండా అధికారులు చూశారని, అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.కాగా కోవిడ్ కారణంగా ఆక్సిజన్ కొరత రాకుండా ఓ ప్లాంట్‌ను తీసుకు రావాలని గతంలో ముఖ్యమంత్రి ఆదేశించిన విషయం తెలిసిందే. తద్వారా మెడికల్ ఆక్సిజన్‌కు లోటు రాకుండా రాష్ట్రం స్వయం సమృద్ధిసాధించాలంటూ అధికారులకు లక్ష్య నిర్దేశం చేశారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు కోవిడ్ నేపథ్యంలో మెడికల్ ఆక్సిజన్ లోటు లేకుండా చూసే చర్యల్లో భాగంగా ఈ కొత్త ప్లాంట్ ఏర్పాటు చేశారు. ఈ ఆక్సిజన్ తయారీ ప్లాంట్ రోజుకు 220 టన్నుల సామర్థ్యం కలిగి ఉంది. ఈ ప్లాంట్‌లో మెడికల్ ఆక్సిజన్, లిక్విడ్ ఆక్సిజన్, లిక్విడ్ నైట్రోజన్, లిక్విడ్ ఆర్గోన్ వాయువుల తయారీ చేయనున్నారు. నోవా ఎయిర్‌తో జనవరి 24, 2020న ఏపీ ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. డిసెంబర్ 18, 2020న పనులు ప్రారంభం కాగా, నవంబర్ 2021న పనులు పూర్తయ్యాయి.


## 'ఎన్టీఆర్ అభిమానుల తరఫున సీఎం జగన్‌కు కృతజ్ఞతలు'




తాడేపల్లి: ప్రజలకు మంచి పాలన అందించాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని, దానిలో భాగంగానే అధికారంలోకి వచ్చిన వెంటనే గ్రామ సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి ప్రజలు మనసు గెలుచుకున్నారని మంత్రి కొడాలి నాని పేర్కొన్నారు. గ్రామ స్థాయిలోనే ప్రజల సమస్యలు పరిష్కారమయ్యేలా చర?యలు తీసుకున్నారని, గిట్టుబాటు ధర కోసం ఆర్బీకేల ద్వారా పంటల కొనుగోళ్లు చేపట్టిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదని కొడాలి నాని ప్రశంసించారు.కొడాలి నాని మాట్లాడుతూ..' ఆర్బీకేల ద్వారా విత్తనాలు, ఎరువులు అందిస్తున్నాం. ఎన్టీఆర్‌కు ద్రోహం చేసిన వ్యక్తి చంద్రబాబు. కొత్త జిల్లాల ఏర్పాటు అర్ధరాత్రి తీసుకున్న నిర్ణయం కాదు. ఎన్టీఆర్ జిల్లా ఏర్పాటు చేసిన సీఎం జగన్‌కు.. ఎన్టీఆర్ అభిమానుల తరఫున కృతజ్ఞతలు. ఎన్నికల హామీ మేరకు కొత్త జిల్లాల ఏర్పాటు. పరిపాలన సౌలభ్యం కోసమే 26 జిల్లాలు ఏర్పాటు. అధికార వికేంద్రకరణ కోసమే 3 రాజధానుల నిర్ణయం' అని కొడాలి నాని పేర్కొన్నారు. కాగా, జిల్లాల పునర్వ్యవస్థీకరణలో విజయవాడ కేంద్రంగా కొత్తగా ఏర్పడబోతున్న జిల్లాకు ఎన్టీఆర్ జిల్లాగా పేరును రాష్ట్ర ప్రభుత్వం ఖరారు చేసిన సంగతి తెలిసిందే.

## ఏపీలో కరోనా విజృంభణ

అమరావతి: ఏపీలో కరోనా విజృంభిస్తోంది. రాష్ట్రంలోని కరోనా పరిస్థితులపై వైద్యాధికారులు హెల్త్ బులెటిన్ విడుదల చేశారు. ఏపీలో కొత్తగా 13,474 కరోనా కేసులు నమోదయ్యాయి. కరోనాతో 9 మంది మృతి చెందారు. ఏపీలో మొత్తం 22,36,047కి కరోనా కేసులు చేరాయి. ఇప్పటివరకు కరోనాతో 14,579 మరణాలు సంభవించాయి. ఏపీలో 1,09,493 కరోనా యాక్టివ్ కేసులు ఉన్నాయి. కరోనా నుంచి 21,11,975 మంది రికవరీ చెందారు.



## చర్చలకు వచ్చేవరకూ ఎదురుచూస్తాం'

అమరావతి: ఉద్యోగులు చర్చలకు వచ్చే వరకూ ఎదురుచూస్తామని మంత్రి పేర్ని నాని స్పష్టం చేశారు. ఉద్యోగులు తమ కుటుంబ సభ్యులని, 3 రోజులు కాదు.. 30 రోజులైనా ఎదురుచూస్తామన్నారు. 'చర్చలకు వచ్చుంటే ఈపాటికే సమస్య పరిష్కారం అయ్యేదేమో. జీవోలు రద్దు చేసేంత వరకూ చర్చలకు రామని చెప్పడం సమంజసం కాదు. జిల్లాల ఏర్పాటు చంద్రబాబుకి హఠాత్తుగా కనిపించొచ్చు. కానీ మేము రెండేళ్లుగా ఈ ప్రక్రియ చేస్తున్నాం. ఎన్టీఆర్ పేరు పెట్టేసరికి చంద్రబాబు షాక్‌కి గురయ్యారు. అందుకే ఎన్టీఆర్ పేరు పై స్పందించడం లేదు. ఎన్టీఆర్ కుటుంబీకులు పురందేశ్వరి, రామకృష్ణ స్వాగతించినందుకు సంతోషం' అని అన్నారు.



## 'వాళ్లు శత్రువులు కాదు... మా ఉద్యోగులే'

అమరావతి: ఉద్యోగులతో చర్చల కోసం ఎదురుచూశామని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి తెలిపారు. ఉద్యోగులను పిలిచి చర్చల కోసం ఎదురు చూసినా వారు రాకపోవడం దురదృష్టకరమన్నారు. ఈరోజు(గురువారం) ఏపీ సచివాలయం నుంచి మీడియాతో మాట్లాడిన సజ్జల.. 'ఈరోజు మధ్యాహ్నం 12 గంటల వరకూ ఉద్యోగుల కోసం ఎదురు చూసాం. వ్యక్తిగతంగా కూడా రమ్మని పిలిచాం. ఎప్పుడైనా చర్చల ద్వారానే పరిష్కారం ఉంటుంది. టీవీల ద్వారా పరిష్కారం జరగదు. సమ్మె చట్ట విరుద్ధమని సుప్రీంకోర్టు చెప్పింది. రేపటి నుండి కూడా మేము అందుబాటులో ఉంటాము. ఉద్యోగ సంఘాలకు చెందిన వారు ఎవరొచ్చినా చర్చిస్తాం. వాళ్ళు శత్రువులు కాదు.. మా ఉద్యోగులే' అని సజ్జల తెలిపారు.



## పరిపాలన సౌలభ్యం కోసమే కొత్త జిల్లాల ఏర్పాటు: విజయ్ కుమార్



విజయవాడ: కొత్త జిల్లాల ఏర్పాటుపై లోతైన అధ్యయనం జరిగిందని ఏపీ ప్రణాళిక విభాగం కార్యదర్శి విజయ్‌కుమార్ తెలిపారు. పరిపాలన సౌలభ్యం కోసమే కొత్త జిల్లాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. జిల్లాల సరిహద్దులు ఎలా ఉండాలనేదానిపై అధ్యయనం చేసినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కొత్త జిల్లాల ఏర్పాటుపై విజయ్ కుమార్ గురువారం ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భౌగోళిక అంశాలు, రవాణా సౌకర్యాలు, మౌలిక వసతుల ఆధారంగా పరిశీలన జరిగిందన్నారు. ప్రజల మనోభావాలను, చారిత్రక నేపథ్యాలను అధ్యయనం చేశామని, ప్రతి జిల్లాకు రెండు రెవెన్యూ డివిజన్లను ప్రతిపాదించామని విజయ్ కుమార్ తెలిపారు.'అసెంబ్లీ నియోజకవర్గాన్ని విడదీయకుండా జిల్లాల ఏర్పాటు, జిల్లా కేంద్రాలు అందరికీ దగ్గరుండేలా చూసుకున్నాం. రాష్ట్రంలో గిరిజన ప్రాంతం విస్తృత పరిధిలో ఉంది. విస్తృతంగా ఉన్న గిరిజన ప్రాంతానికి ఒక జిల్లా ఉంటే ఇబ్బందులు ఉంటాయి. గిరిజ నుల అభివృద్ధి కోసం సీఎం ఆలోచించి రెండు జిల్లాలు ఏర్పాటు చేశారు. శ్రీకాకుళం పేరున్న ఇన్‌స్టిట్యూట్‌లన్నీ ఎచ్చెర్లలో ఉన్నాయి. అందుకే ఎచ్చెర్లను శ్రీకాకుళంలో కలిపాం. విజయనగరం విస్తీర్ణం కోసమే రాజాంను ఆ జిల్లాలో కలిపాం. విజయనగరం అభివృద్ధి దెబ్బతినకుండా జిల్లా ఏర్పాటు చేశాం. పెందుర్తిని తీసేస్తే అనకాపల్లి వెనకపడే అవకాశం ఉంది. భీమిలి గత ప్రాముఖ్యత దృష్ట్యా రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేశాం. రంపచోడవరం అభివృద్ధి కోసమే అల్లూరి జిల్లాలో కలిపాం' అని తెలిపారు.

## కృష్ణా జిల్లాకు ఎన్టీఆర్ పేరు పెడితే మేమెందుకు వ్యతిరేకిస్తాం: చంద్రబాబు



అమరావతి: కృష్ణా జిల్లాకు ఎన్టీఆర్ పేరు పెడితే తామెందుకు వ్యతిరేకిస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు అన్నారు. ఎన్టీఆర్‌ను ఎవరు గౌరవించినా తాము స్వాగతిస్తామని చెప్పారు. ఎన్టీఆర్ కేవలం ఒక ప్రాంతానికి చెందిన నేత కాదని, ఎన్టీఆర్‌కు భారత రత్న ఇవ్వాలని టీడీపీ డిమాండ్ చేస్తోందన్నారు. హైదరాబాద్‌లో ఎయిర్‌పోర్ట్‌కి ఎన్టీఆర్ పేరును వైఎస్ఆర్ తొలగించారని విమర్శించారు. కడప జిల్లాకు వైఎస్ పేరు పెట్టినా తాము వ్యతిరేకించలేదని గుర్తుచేశారు. టీడీపీకి ద్వంద్వ విధానాలు ఉండవని చంద్రబాబు ప్రకటించారు. ఏపీలో ఎన్టీఆర్ విగ్రహాలను ధ్వంసం చేస్తున్నారని తప్పుబట్టారు. ఎన్టీఆర్ స్మృతి వనం ప్రాజెక్ట్‌ను నిలిపివేసిన జగన్‌రెడ్డి ప్రభుత్వం.. ఎన్టీఆర్‌పై ప్రేముందని చెప్పే ప్రయత్నాన్ని ప్రజలు నమ్మరని తెలిపారు. "అన్నా క్యాంటీన్‌లను జగన్‌రెడ్డి నిలిపివేయడం నిజం కాదా? కొత్త జిల్లాల నిర్ణయంపై వైసీపీలోనే వ్యతిరేకత వస్తోంది. తొందరపాటు నిర్ణయాలతో ఇప్పటికే ఏపీకి జగన్‌రెడ్డి తీవ్రనష్టం చేశారు. అశాస్త్రీయంగా చేసిన కొత్త జిల్లాల ఏర్పాటుతో.. ప్రాంతాల మధ్య విభేదాలు తలెత్తే పరిస్థితి వస్తుంది. కనీసం కేబినెట్‌లో కూడా సమగ్రంగా చర్చించకుండా.. రాత్రికి రాత్రి నోటిఫికేషన్ విడుదల చేయాల్సిన అవసరమేంటి?. రాజధానుల తరలింపు, జిల్లాల ఏర్పాటు వంటి కీలక అంశాలపైనా.. రాజకీయ ప్రయోజనం పొందాలని చూస్తున్నారు.

# సంపాదకీయం

శుక్రవారం 28 జనవరి 2022

## నిత్యవసరంగా మారిన ఇంటర్నెట్

కరోనా వ్యాధి వల్ల సమాజంలో ఏర్పడిన పరిస్థితుల వల్ల ప్రతి ఒక్కరికి ఇంటర్ నెట్ అందుబాటులోకి తీసుకురావడం అనేది ఒక ముఖ్యమైన మానవ హక్కుగా అవతరించింది.అంతర్జాల సదుపాయం అనేది భావస్వేచ్ఛలో అంతర్భాగం. అంతర్జాలం అందు బాటులోకి రావడంవల్ల మన అభిప్రాయాలను సామాజిక మాధ్య మాల ద్వారా అందరికీ తెలియపరచడానికి అవకాశం ఉంటుంది.కరోనా వల్ల ఈ సంవత్సరంలో విద్యావిధానం మొత్తానికి ఆన్‌లైన్ వేదికలు వెన్నుదన్నుగా నిలిచాయి. ప్రస్తుత తరుణంలో మానవ మనుగడకు నీరు, నిప్పు, విద్యుత్ ఎంత అవసరమో అంతర్జాలం కూడా అంతే అవసరం.అంతర్జాలం లేకుండా ఈ రోజున మన జీవన లక్ష్యాలను చేరుకోవడం అంత సులభం కాదు. 2016 ఐక్య రాజ్యసమితి సాధారణ సమావేశంలో మానవ హక్కుల సమితి, అంతర్జాల సదుపాయం అనేది నేడు అత్యంత ముఖ్యమైనమానవ హక్కుగా అభివర్ణించింది. 2012 ఆగస్టులో అంతర్జాల సమాఖ్య నిర్వహించిన ఒక సర్వేలో పదివేల మంది పాల్గొనగా, 20 దేశాల నుండి వాళ్లల్లో 83 శాతంమంది అంతర్జాల సదుపాయాన్ని ప్రాథమిక మానవ హక్కుగా చట్టబద్ధం చేయాలని అభిప్రాయపడ్డారు.సమాజంలో ఓ గౌరవ ప్రదమైన జీవనం సాగించాలంటే ప్రాథమిక హక్కులు తప్పనిసరి. సమాజంలో వేళ్లూనుకున్న అసమానతలు, అంతరాలు, పేదరికం వంటి అనేక సమస్యలు రూపుమాపడానికి ప్రాథమిక హక్కుల వల్లే సాధ్యం.రాజ్యాంగంలోని మూడవ భాగంలో ప్రాథమిక హక్కు పొందుపరచడం జరిగింది. వ్యక్తిగత స్వేచ్ఛ, సమానత్వహక్కు, భావస్వేచ్ఛ, జీవించే హక్కు, దోపిడీ నుండి విముక్తి, మత స్వేచ్ఛ ఉద్యోగం సంపాదించే హక్కు వంటి అనేక ప్రాథమిక హక్కులు పౌరులకు మన రాజ్యాంగంకల్పిస్తోంది. కరోనా వల్ల ఏర్పడ్డ విపత్కర పరిస్థితుల వల్ల ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కుదేలయ్యింది. లక్షలాది ఉద్యోగాలు ఆవిరైపోవడటంతో యువత రోడ్లపైపడ్డారు.తమ భవిష్యత్తు ఎలా ఉండబోతోందని యువతలో ఆందోళన, భయం మరింత పెరిగిపోతోంది. ఈ విపత్కర పరిస్థితుల వల్ల మార్కెట్లోని వ్యాపారాలు 50 శాతం అంతర్జాల పరమైపోయాయి. వ్యాపార, వాణిజ్యవర్గాలు కార్పొరేట్ సంస్థలు తమ కార్యకలాపాలన్నింటినీ ఆన్‌లైన్‌లో నిర్వహించడానికి ఇప్పటికే అలవాటుపడ్డాయి. ఆన్‌లైన్‌లో సమావేశాలు, సెమినార్లు నిర్వహిస్తూ తమ పనులను ముందుకు తీసుకువెళ్తున్నాయి.అంతర్జాలంలో ఇప్పటికే ఎక్కువ శాతం ఆర్థిక కార్యకలాపాలు జరుగుతున్నాయి. రోజువారి కార్యకలాపాలు నిర్వహణకు అంతరా యాలు లేని అంతర్జాలం ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉండాలి. ప్రపంచవ్యాప్తంగా సమాచార సేకరణ, దాన్ని వినియోగదారులకు అందుబాటులోకి తేవడానికి, అంతర్జాలం అత్యవసరం. లాక్‌డౌన్ వల్ల పాఠశాలలు, కళాశాలలు మూతపడటంతో అతి తక్కువ ఖర్చులో, నాణ్యమైన విద్యను ఆరు నెలలుగా అంతర్జాలం ద్వారా ఆన్‌లైన్ తరగతులను నిర్వహిస్తున్నారు.దీనివల్ల వెనుకబడిన ప్రాంతాల్లోని విద్యార్థులు తీవ్రంగా నష్టపోయారని చెప్పవచ్చు. ఇప్పటికీ దేశంలో 40 శాతం వెనుకబడిన ప్రాంతాల ప్రజలకు అంతర్జాలం అందుబాటులో లేదు.దేశంలోని ప్రతిపౌరుడికిస్వేచ్ఛగా మాట్లాడటం తమఅభిప్రాయాలు వెల్లడించడానికి హక్కులున్నాయి. ఎరవైనా సరే తమ అభిప్రాయాలను, ఆలోచనలను నోటి ద్వారా కాని, రాత ద్వారా కాని, మరే విధంగానైనా వెల్లడించే హక్కు ఉంది.రాజ్యాంగంలోని 19(1) ఆర్టికల్ ప్రకారం దేశంలో ప్రతి వ్యక్తికి తన ఆలోచనలను వ్యక్తపరించే హక్కు ఉన్నది. ఎటువంటి భయం లేకుండా స్వేచ్ఛగా తమ అభిప్రాయాలు వ్యక్తపరచవచ్చు. ఆర్టికల్ 21ఎ ప్రకారం దేశంలోని ప్రతిపౌరుడికి చదువ్వకునే హక్కు ఉంది. 14ఏళ్ల వయస్సు వరకూ చదువ్వకునే అవకాశం మన రాజ్యాంగం కల్పిస్తోంది.ఉచిత నిర్బంధ విద్యతోపాటు, అంతర్జాల సదుపాయం, ఉపాధి తప్పనిసరిగా యువతకు అందిస్తేనే సాధికా రత సాధించగలుగుతారు. ఆర్టికల్ 21 ప్రకారం రాజ్యాంగం ప్రతి ఒక్కరికీ వ్యక్తిగత స్వేచ్ఛ ప్రసాదించింది.ఇందులోనే వ్యక్తిగత గోప్యత కూడా ఇమిడిఉంది.అంతర్జాలం ద్వారా విద్య, వ్యాపారం, వ్యక్తిగత అభివృద్ధి సాధ్యమైతే, అంతర్జాలం ద్వారా వ్యక్తిగత స్వేచ్ఛ కూడా సాధ్యమే. అందుకే 2015 నవంబరులో ఐక్యరాజ్య సమితి సమావేశం అంతర్జాల సదుపాయం పొందే హక్కును కూడా ప్రపంచంలోని ప్రతి ఒక్కరి ప్రాథమిక హక్కు అని నిర్ణయించింది.విద్యాహక్కు మాదిరిగానే అంతర్జాల హక్కును కూడా అంతర్జాతీయ రాజకీయ, పౌర ఒడం బడికలో ఆర్టికల్ 13 అత్యవసరం అని పేర్కొన్నది. సమాచారాన్ని స్వేచ్ఛగా వ్యాపింప చేయడానికి ఇది దోహదపడుతుందన్నారు.సంప్రదాయ మీడియాకు భిన్నంగా నేడు అంతర్జాలంద్వారా సమాచారాన్ని అత్యంత వేగంగా అందుకోగలుగుతున్నాం.2016లో ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల సమాఖ్య అంతర్జాల సదుపా యాన్ని ప్రాథమిక మానవ హక్కుగా ప్రకటించింది. అభివృద్ధిచెందుతున్న దేశాలలోని ప్రజలకు అభివృద్ధి చెందే హక్కును మూడోతరం మానవ హక్కుగా ఐక్య రాజ్యసమితి ప్రకటించింది. అంతర్జాతీయ చట్టాలు కూడా మానవ హక్కులకు, అంతర్జాలసదుపాయం పొందే హక్కుకు, ఉన్న అవినా భావ సంబంధాన్ని గుర్తించాయి.2020 అనిరుధ్‌భాసిన్ కేసులో అంతర్జాల సదుపాయం పొందే హక్కును, స్వేచ్ఛగా అందరూ సంభాషించే హక్కుగా అభిప్రాయపడింది. ఈ కేసులో అంతర్జాల సదుపాయాన్ని తృణీకరించడం, అధికారాన్ని దుర్వినియోగపరచ డమే అని పేర్కొన్నది.ఆర్టికల్ 21ఎ ప్రకారం విద్యాహక్కును కలిగి ఉండటం,అదేవిధంగా 19(1) ఆర్టికల్ ప్రకారం వృత్తి, వ్యాపా రాలు కొనసాగించే హక్కు కలిగి ఉన్నామంటే అంతర్జాలం ద్వారా వాటిని నిర్వహించే హక్కుకూడా కలిగి ఉండటమే.కేరళ ప్రభుత్వా నికి వ్యతిరేకంగా వేసిన ఒక కేసులో అంతర్జాల సదుపాయం పొందేహక్కు, వ్యక్తి గత గోప్యతలో అంతర్భాగమే అని ఆ రాష్ట్ర కోర్టు స్పష్టంచేసింది.అదే కేసులో కళాశాలలు మౌలిక వసతుల కొరతతో విద్యార్థులను వివక్షకు గురిచేయడం నేరమని పేర్కొన్నది. అంతర్జాల సదుపాయం పొందేహక్కు, జీవించే హక్కు, వ్యక్తిగత స్వేచ్ఛవంటి వాటిలో అంతర్లీనంగా దాగి ఉంటుందనేది తోసిపుచ్చ లేనివాస్తవం. అంతర్జాలం అందుబాటులో ఉండటం వల్ల పౌరులు తమ అభిప్రా యాలను వేదికలపై పంచుకోవడానికి అవకాశం ఉంటుంది.

# పట్టు పరిశ్రమలకు కొత్త కష్టాలు

అనంతపురం, జనవరి 27, (న్యూస్ పల్స్) కరోనా ప్రభావంతో పట్టు పరిశ్రమ పట్టుతప్పుతోంది. ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకం సకాలంలో అందకపోవడంతో రైతుల్లో నిర్లిప్తత నెలకొంది. బైవోల్టిన్ రకం పట్టుగూళ్లకు రాష్ట్రప్రభుత్వం 2004 నుంచి కిలో రూ.50 చొప్పున రైతుకు ప్రోత్సాహకం అందిస్తూ వచ్చింది. అయితే గడిచిన రెండేళ్లుగా ఈ ప్రోత్సాహకం అందడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ.12 కోట్లు వరకు బకాయిలు చెల్లించాల్సి ఉంది. ప్రస్తుతం మన రాష్ట్రంలో లభిస్తోన్న ధర కన్నా కర్నాటకలో అధికంగా లభిస్తుండటంతో రైతులు అటువైపు ఆసక్తి చూపుతున్నారురాష్ట్ర వ్యాప్తంగా సుమారు 1.11 లక్షల ఎకరాల్లో మల్బరీ పంట సాగవుతోంది. సుమారు తొమ్మిది వేల మెట్రిక్ టన్నుల పట్టు ఉత్పత్తి అవుతోంది. దేశంలోనే కర్నాటక తరువాత ఆంధ్రప్రదేశ్‌లోనే అత్యధికంగా పట్టు ఉత్పత్తి జరుగుతోంది. ఇందులో అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో అధికంగా సాగవుతోంది. ఒక్క అనంతపురం జిల్లాలోనే 40 వేల ఎకరాల్లో పట్టు సాగులో ఉంది. ఏటా మూడు వేల మెట్రిక్ టన్నులకుపైగా ఉత్పత్తి వస్తోంది. కరోనా ప్రభావంతో రెండేళ్లుగా మార్కెట్లు పూర్తిగా మూతపడటంతో పట్టుగూళ్ల ధరలు దారుణంగా పడిపోయాయి. 2020 కిలో పట్టుగూళ్ల ధర రూ.150 నుంచి 50కి పడిపోయింది. దీంతో రైతులు పెద్ద ఎత్తున నష్టపోయారు. దక్కిన ధరకు తెగనమ్మారు. ప్రభుత్వం అందిచాల్సిన ప్రోత్సాహం అందిస్తే కొంతలో కొంతైనా నష్టాన్ని పూడ్చికోవచ్చని రైతులు భావించారు. అయితే రాష్ట్రప్రభుత్వం వారి ఆశలకు గండికొట్టింది. రెండేళ్ల నుంచి ప్రోత్సాహమే ఇవ్వలేదు. అధికారులకు విన్నవించినా ఫలితం లేదు. ఈ రకంగా సుమారు రాష్ట్రవ్యాప్తంగా 2400 మెట్రిక్ టన్నులకు ప్రోత్సాహకం అందించాల్సి ఉంది. ఒక్క అనంతపురం జిల్లా పరిధిలోనే సుమారు ఏడు కోట్ల రూపాయల ప్రోత్సాహకం పెండింగులో ఉంది.గడిచిన రెండేళ్లుగా పట్టుగూళ్లకు ఆశించిన ధర రావడం లేదు. ప్రస్తుతం బహిరంగ మార్కెటులో కిలో రూ.150 నుంచి 180 పలుకుతోంది. అయితే కర్నాటక రాష్ట్రంలో కిలో రూ.500 నుంచి 600 పలకడంతో అధికశాతం రైతులు అటువైపు ఆసక్తి చూపుతున్నారు. మనరాష్ట్రంలో పట్టుగూళ్లను అమ్మితే రాష్ట్రప్రభుత్వం నుంచి ప్రోత్సాహకం లభిస్తుంది. ఇతర రాష్ట్రాల్లో విక్రయిస్తే ఎటువంటి ప్రోత్సాహకం అందదు. గడిచిన రెండేళ్లుగా మన రాష్ట్ర ప్రభుత్వం పట్టుగూళ్లకు ప్రోత్సాహకం అందించకపోవడంతో చాలా మంది రైతులు ప్రభుత్వ ప్రోత్సాహకాన్ని వదులుకొని కర్నాటక మార్కెటుకు పట్టుగూళ్లు తరలిస్తున్నారు. నష్టాల నుంచి గట్టెక్కుతామనే ఆశతో కర్నాటకకు తరలిస్తున్నామని పలువురు రైతులు తెలిపారు.

# నేతలకు ఘన నివాళి

ఎన్టీఆర్ పేరిట కొత్త జిల్లా ను ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి జగన్ తొలుత ఇచ్చిన హామీని అమలు పర్చారు. విజయవాడ కేంద్రంగా ఏర్పాటు చేయబోయే కొత్త జిల్లాకు దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ పేరును పెట్టాలని నిర్ణయించారు. ఈ జిల్లాలో విజయవాడ ఈస్ట్, విజయవాడ వెస్ట్, విజయవాడ సెంట్రల్, మైలవరం, నందిగామ, జగ్గయ్యపేట, తిరువూరు నియోజకవర్గాలను చేర్చారు. మచిలీపట్నం కేంద్రంగా కృష్ణా జిల్లాను ఏర్పాటు చేయనున్నారు. అలాగే కృష్ణా జిల్లా... కృష్ణా జిల్లా పేరును తొలగించవద్దని కొందరు చేసిన సూచనల పరిగణనలోకి తీసుకుని మచిలీపట్నం కేంద్రంగా ఉన్న జిల్లాకు కృష్ణా జిల్లా పేరును కంటిన్యూ చేస్తున్నారు. కృష్ణా జిల్లాలో పెడన, అవనిగడ్డ, పామర్రు, మచిలీపట్నం, పెనమలూరు, గన్నవరం, గుడివాడ నియోజకవర్గాలను చేర్చనున్నారు. కృష్ణా నదికి ప్రాముఖ్యత ఉండటంతో ఆ పేరును మచిలీపట్నం కేంద్రంగా ఉండే జిల్లాకు ఉంచనున్నారు. అల్లూరి సీతారామరాజు పేరుతో కొత్త జిల్లా ఏర్పాటుకానుంది. పాడేరు కేంద్రంగా ఈ కొత్త జిల్లా ఏర్పాటు కాబోతుంది. ఈ జిల్లా పరిధిలో పాడేరు, అరకు, రంపచోడవరం నియోజకవర్గాలను చేర్చారు. ఇక పార్వతీపురం కేంద్రంగా మన్యం జిల్లాను కొత్తగా ఏర్పాటు చేయబోతున్నారు. ఈ జిల్లా పరిధిలో పాలకొండ, పార్వతీపురం, కురుపాం, సాలూరు అసెంబ్లీ నియోజకవర్గాలుంటాయి. గిరిజనులు అత్యధికంగా నివసించే ఈ ప్రాంతంలో రెండు జిల్లాలు కొత్తగా ఏర్పాటు కాబోతున్నాయి.ఇక మహనీయులు పొట్టి శ్రీరాములు పేరును అలాగే ఉంచుతారు. నెల్లూరు జిల్లా కేంద్రంగా ఉండే ఈ జిల్లాలో నెల్లూరు సిటీ, నెల్లూరు రూరల్, కోవూరు, సర్వేపల్లి, కావలి, ఆత్మకూరు, ఉదయగిరి, కందుకూరు నియోజకవర్గాలుండనున్నాయి. ప్రకాశం జిల్లాలోని కందుకూరు నియోజకవర్గం పొట్టి శ్రీరాములు జిల్లాలోకి వెళ్లనుంది. వైఎస్సార్ జిల్లాను కూడా అలాగే ఉంచనున్నారు. కడప కేంద్రంగా ఉండే ఈ జిల్లాలో కడప, కమలాపురం, జమ్మలమడుగు, పులివెందుల, ప్రొద్దుటూరు, మైదుకూరు, బద్వేలు నియోజకవర్గాలు ఉండనున్నాయి.

# తిరుచానూరు ఆలయానికి గోదానం చేసిన టీటీడీ ఛైర్మన్ దంపతులు

## శ్రీయాగం లో పాలుపంచుకున్న అర్చకులు, ఆలయ అధికారులు, సిబ్బందికి సన్మానం

తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయానికి టీటీడీ ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి దంపతులు గురువారం గోవు, దూడ దానం చేశారు. నవకుండాత్మక శ్రీ యాగం ముగింపు అనంతరం ఛైర్మన్ దంపతులు శాస్త్రోక్తంగా గో పూజ నిర్వహించారు. గోవు, దూడ కు దాణా, పండ్లు తినిపించారు. అనంతరం గోవు, దూడ ను దానంగా అందించారు. అనంతరం ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి దంపతులు శ్రీ యాగం నిర్వహణలో పాలుపంచుకున్న శ్రీ వేంపల్లి శ్రీనివాస్, శ్రీ బాబు స్వామి తో పాటు 70 మంది అర్చకులను శాలువతో సత్కరించి, బంగారు డాలర్, సంభావనలు అందించారు. వీరితో పాటు ఆలయ డిప్యూటీ ఈవో శ్రీమతి కస్తూరి భాయి, ఏఈవో శ్రీ ప్రభాకర్ రెడ్డి, ఆలయ అధికారులు, సిబ్బంది, విజిలెన్స్ అధికారులు, సిబ్బంది, ఎస్వీబీసీ, టీటీడీ ప్రజాసంబంధాల విభాగం సిబ్బందిని శాలువతో సన్మానించారు. దేశం, రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల నుంచి బయట పడతాయి : టీటీడీ ఛైర్మన్ నవకుండాత్మక శ్రీ యాగం అర్చకులుశాస్త్రోక్తంగా, బ్రహ్మాండంగా నిర్వహించారని టీటీడీ ఛైర్మన్ శ్రీ వైవి సుబ్బారెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. యాగం ముగిసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 50 సంవత్సరాల క్రితం శ్రీశ్రీ చిన జీయర్ స్వామివారి తాత ఈ యాగం నిర్వహించారన్నారు. ఇప్పుడు శ్రీ పద్మావతి అమ్మవారు తమ ద్వారా యాగం జరిపించారని చెప్పారు. యాగ ఫలితం వల్ల కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు, దేశ ప్రజలు ఆర్థిక ఇబ్బందుల నుంచి బయట పడతారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ ఆరోగ్యంగా, సంతోషంగా ఉండాలని సుబ్బారెడ్డి కోరారు. యాగం మహా పూర్ణాహుతికి కంచి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విజయేంద్ర సరస్వతి హాజరయ్యారని, శ్రీశ్రీ చినజీయర్ స్వామి ఫోన్ ద్వారా తమ ఆశీస్సులు అందజేశారని ఆయన తెలిపారు.

# గందరగోళంగా కొత్త జిల్లాల ఏర్పాటు ప్రతిపాదనలు

## వెల్లువెత్తుతున్న అభ్యంతరాలు

విజయవాడ జనవరి 27 కొత్త జిల్లాల ఏర్పాటు ప్రతిపాదనలు గందరగోళంగా తయారయ్యాయి. వీటి పై అభ్యంతరాలు వెల్లువెత్తుతున్నాయి. భౌగోళికంగానూ ఇబ్బందులు ఎదురయ్యేలా ఉన్నాయి. విశాఖలోని ఏజెన్సీ ప్రాంతాలన్నింటినీ కలిపి ఒక జిల్లాగా ఏర్పాటుచేసి, దానికి అల్లూరి సీతారామరాజు పేరు పె ట్టాలనే డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. ప్రభుత్వం ఇప్పుడు అరకు పార్లమెంటు నియోజకవర్గంలోని పాడేరు, అరకు అసెంబ్లీ నియోజకవర్గాలతో పాటు తూర్పుగోదావరి జిల్లాలోని రంపచోడవరాన్ని కలిపి పాడేరు కేంద్రంగా కొత్త జిల్లా ప్రకటించి దానికి అల్లూరి పేరు పెట్టనున్నట్టు తెలిపింది. అలాగే, విజయనగరం జిల్లాలోని పార్వతీపురం, సాలూరు, కురుపాం, శ్రీకాకుళం జిల్లాలోని పాలకొండ నియోజకవర్గాలను కలిపి 'మన్యం' జిల్లా ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించింది. అయితే విశాఖ ఏజెన్సీనే 'మన్యం'గా వ్యవహరిస్తున్నారు. ఇప్పుడు మైదాన ప్రాంతాలైన పార్వతీపురం, సాలూరు, పాలకొండ, కురుపాంల 'మన్యం' పై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి.కొత్త జిల్లాల ప్రతిపాదనలపై తూర్పుగోదావరి జిల్లాలో ఆగ్రహం వ్యక్తమవుతోంది. కోనసీమ జిల్లాలో.. రామచంద్రపురం, మండపేటలను చేర్చారు. ఇవి కోనసీమేతర ప్రాంతాలు. ఇక్కడి వారికి కాకినాడ జిల్లా దగ్గరగా ఉంటుంది. రంచోడవరం, ఎటపాక రెవెన్యూ డివిజన్ల మండలాలను అల్లూరి సీతారామరాజు జిల్లాలో కలుపుతూ ప్రభు త్వం నిర్ణయం తీసుకుంది. దీని వల్ల 250 కిలోమీటర్లకుపైగా దూరం ఉన్న పాడేరు వెళ్లడం అసాధ్యమని ఆదివాసీ సంఘాలు అభ్యంతరా లు వ్యక్తం చేస్తున్నాయి. ఏలూరు జిల్లాలో చేరనున్న కృష్ణా జిల్లా ఆగిరిపల్లి.. విజయవాడకు చేరువలో ఉంటుంది. కానీ నూజివీడు నియోజకవర్గాన్ని ఏలూరు జిల్లాలో విలీనం చేయడం వల్ల దాదాపు 60 కి లోమీటర్లు ప్రయాణ భారం పెరగుతుంది. అలాగే, కృష్ణా జిల్లాలోనూ గందరగోళం ఏర్పడింది. ఇప్పటివరకు ఇదే జిల్లాలో ఉన్న నూజివీడు, కైకలూరులకు జిల్లావాసులతో అనుబంధం తెగిపోనుంది. ఈ రెండూ ఏలూరు జిల్లాకు వెళ్తాయని ముసాయిదాలో పేర్కొన్నారు.మరో వి చిత్రం ఏమిటంటే.. విజయవాడ కేంద్రంగా కొత్తగా ఏర్పడే జిల్లాకు ఎన్టీఆర్ జిల్లాగా నామకరణం చేశారు. వాస్తవానికి ఎన్టీఆర్ స్వగ్రామం నిమ్మకూరు పామర్రు నియోజకవర్గంలో ఉంది. ఇది కృష్ణా జిల్లాలో ఉంది. ఇక గుంటూరు జిల్లాను ప్రధానంగా పల్నాడు జిల్లా కేంద్రంగా నరసరావుపేటను ప్రతిపాదించడంపై అభ్యంతరాలు ఉన్నాయి. వాస్తవానికి పల్నాడు అంటే గురజాల, మాచర్ల అని.. ఆ రెండు చోట్లలో ఎ క్కడైనా జిల్లా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని టీడీపీ, వైసీపీ నేతలు డిమాండ్ చేస్తున్నారు. ప్రకాశం జిల్లా విభజన హేతుబద్ధంగా లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. చిత్తూరు జిల్లా మూడు ముక్క లు కానుంది. చంద్రగిరిని తిరుపతి జిల్లా పరిధిలో చేర్చారు. పుంగనూరును చిత్తూరు జిల్లాలోనే ఉంచారు. మున్సిపల్ పట్టణంగా యాభై ఏళ్ళ చరిత్ర ఉన్న శ్రీకాళహస్తిని దానికంటే ఎంతో చిన్నదైన నాయుడుపేట డివిజన్‌లో చేర్చడం గమనార్హం. రాజంపేట (అన్నమయ్య) జిల్లాకు మదనపల్లెను కేంద్రం గా ప్రకటించాలని ఉద్యమం నడుస్తోంది. ఇప్పుడు అన్నమయ్య జిల్లా పేరుపెట్టి కడప జిల్లా రాయచోటిని జిల్లా కేంద్రంగా చేయడం మదనపల్లె వాసులకు ఆ గ్రహం తెప్పిస్తోంది. అనంతపురం జిల్లాలో అనంతపురం, హిందూపురం పార్లమెంటు స్థానాలు రెండు జిల్లాలవుతున్నాయి. హిందూపు రాన్ని సత్యసాయి జిల్లాగా మార్చారు. రాప్తాడు అసెంబ్లీని అనంతపురం జిల్లాలో చేర్చారు. రాప్తాడు నియోజకవర్గాన్ని అనంతపురం జిల్లాలో చేర్చడం వెనుక రాజకీయ వ్యూహం ఉన్నట్లు భావిస్తున్నారు. రాప్తాడు నియోజకవర్గంలో పరిటాల కుటుంబానికి మంచి పట్టు ఉంది. ఈ నేపథ్యంలో వారి బలం తగ్గించే ఉద్దేశంతోనే స్థానిక అధికార పార్టీ ముఖ్య ప్రజాప్రతినిధులు రాప్తాడును అనంతపురం జిల్లా లో చేర్చారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### రసాభాసగా పలాస-కాశీబుగ్గ మునిసిపల్ భేటీ

శ్రీకాకుళం పలాస–కాశీబుగ్గ మున్సిపల్ సర్వసభ్య సమావేశం రసాభసగా మారింది. ప్రజా సమస్యలపై పలుమార్లు వినతిపత్రం అందించినా, స్పందించని ఛైర్మన్ కు వ్యతిరేకంగా నిరసనలు వ్యక్తం చేస్తూ వైస్ ఛైర్మన్ తోపాటు అధికార పార్టీకి చెందిన పలువురు కౌన్సిలర్లు బైఠాయించారు. సభా నిబంధనలు పాటించని కౌన్సిలర్లపై యాక్ట్ 1965 చట్టం ప్రకారం సస్పెండ్ చెయ్యాలని కమిషనర్ ను ఛైర్మన్ బల్ల గిరిబాబు ఆదేశించారు

### కొత్త జిల్లా ఏర్పాటు నిరసన

రాజంపేట కొత్త జిల్లాల ఏర్పాటులో తమకు అన్యాయం జరిగిందంటూ రాజంపేట ప్రజలు రోడ్డెక్కారు. పేరుకు అన్నమయ్య జిల్లా పెట్టి జిల్లా కేంద్రాన్ని రాయచోటికి మార్చడం పట్ల రాజంపేటకు చెందిన అన్ని పార్టీల నాయకులు ఉద్యమానికి సిద్దమయ్యారు. వేలాది విద్యార్థులు ప్రజా సంఘాల ఆద్వర్యంలో రాజంపేటలో నిరసన కార్యక్రమం చె?పట్టారు. ఈ ర్యాలీలో మున్సిపలి ఛైర్మన్ పోలా శ్రీనివాసుల రెడ్డితో పాటు వైస్ ఛైర్మన్ మల్లు రవి టీడీపీ నాయకులు పాల్గొన్నారు. రాజంపేటను జిల్లా కేంద్రంగా ప్రకటించకపోతే రాజీనామాలు చేసి అయినా పోరాడాలని ప్రజలు డిమాండ్ చేశారు.

# ఉగాది నాటికి కొత్త జిల్లాల నుంచే పాలన

విజయవాడ, జనవరి 27, (న్యూస్ పల్స్) ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్ కీలక నిర్ణయం తీసుకున్నారు. కొత్త జిల్లాల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈరోజు, రేపు దీనిపై నోటిఫికేషన్ వెలువడే అవకాశముంది. ఉగాది నాటికి కొత్త జిల్లాల ప్రక్రియను పూర్తి చేయాలని జగన్ భావిస్తున్నారు. ఈ మేరకు జగన్ అధికారులను ఆదేశించారు. ఇప్పటికే కొత్త జిల్లాల ఏర్పాటుపై ముఖ్యమంత్రి జగన్ ఒక కమిటీని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. కమిటీ నివేదిక కూడా ఇవ్వడంతో నోటిఫికేషన్ ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమయింది. జగన్ 2019 ఎన్నికలకు ముందు పాదయాత్రలో ప్రజలకు స్పష్టమైన హామీ ఇచ్చారు. ప్రతి పార్లమెంటు నియోజకవర్గాన్ని జిల్లా కేంద్రంగా చేస్తానని చెప్పారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ లో 13 జిల్లాలున్నాయి. వాటితో పాటు మరో పదమూడు కొత్త జిల్లాలను ఏర్పాటు చేయాలని జగన్ నిర్ణయించారు. అంటే ఏపీలో మొత్తం 26 జిల్లాలను ఏర్పాటు చేయాలని దాదాపుగా నిర్ణయించారు. సుదీర్ఘ కసరత్తు జరిపిన తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. అతి పెద్దదిగా ఉన్న అరకు ప్రాంతాన్ని రెండు జిల్లాలుగా ఏర్పాటు చేసే అవకాశాలున్నాయి. రెండు గిరిజన జిల్లాలను ఏర్పాటు చేయాలన్న ఉద్దేశ్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. జిల్లా కేంద్రాలను ఏర్పాటు చేస్తే ఆటోమేటిక్ గా అభివృద్ధి జరుగుతుందని ప్రభుత్వం భావిస్తుంది. అక్కడ అన్ని రకాలుగా మౌలిక సదుపాయాలను కల్పిస్తే వివిధ రంగాల్లో అభివృద్ధి దానంతట అదే జరుగుతుందని భావిస్తున్నారు.ఈ నేపథ్యంలో ఈరోజు కాని రేపు కాని కొత్త జిల్లాలపై ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశాలున్నాయి. కొత్త జిల్లాల్లోనూ ఇప్పటికే జగన్ ప్రభుత్వం మెడికల్ కళాశాలలను కూడా ప్రారంభించేందుకు సిద్ధమయింది. ఈ నేపథ్యంలో వచ్చే ఉగాది నాటికి కొత్త జిల్లాల ప్రక్రియను పూర్తి చేయాలన్నది జగన్ ప్రభుత్వం ఆలోచనగా ఉంది. జిల్లా కలెక్టరేట్లు, ఎస్పీ కార్యాలయాలను ఎక్కడెక్కడ ఏర్పాటు చేయాలో కూడా గుర్తించారు. మొత్తం మీద ఏపీలో మరో 13 కొత్త జిల్లాలు నేడో, మాపో రాబోతున్నాయి.

## కోనసీమ సెంటిమెంట్ పోయినట్టేనా

కాకినాడ, జనవరి 27, (న్యూస్ పల్స్) అతి పెద్దదైన తూర్పు గోదావరి జిల్లా ఇక మూడు జిల్లాలుగా మారబోతుంది. 19 అసెంబ్లీ నియోజకవర్గాలు, మూడు పార్లమెంటు నియోజకవర్గాలు తూర్పు గోదావరి జిల్లాలో ఉండేవి. తూర్పుగోదావరి జిల్లాలో అత్యధిక స్థానాలను సాధించిన పార్టీ అధికారంలోకి వస్తుందన్న సెంటిమెంట్ ఉండేది. ఇక తూర్పు గోదావరి జిల్లా మూడు జిల్లాలుగా కానుంది. కాకినాడ, రాజమండ్రి, అమలాపురం జిల్లా కేంద్రాలుగా ఏర్పాటు కాబోతున్నాయి. అమలాపురం జిల్లాకు కోనసీమ జిల్లాగా పేరు పెట్టనున్నారు. ఈ జిల్లా పరిధిలో రాజోలు, కొత్తపేట, రామచంద్రాపురం, ముమ్మడివరం, మండపేట, అమలాపురం, పి.గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. అలాగే కాకినాడ జిల్లా కేంద్రంగా తుని, ప్రత్తిపాడు, పిఠాపురం, కాకినాడ సిటీ, కాకినాడ రూరల్ జగ్గంపేట, పెద్దాపురం నియోజకవర్గాలుంటాయి. రాజమండ్రి జిల్లా కేంద్రంగా రాజమండ్రి సిటీ, రాజమండ్రి రూరల్, అనపర్తి, రాజానగరం, కొవ్వూరు, నిడదవోలు, గోపాలపురం నియోజకవర్గాలుంటాయి. ఇప్పటి వరకూ తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలు రాష్ట్ర రాజకీయాలను శాసించేవి. ఇకపై ఆ మాట వినపడే అవకాశం లేదు. ఈరెండు జిల్లాలు మొత్తం ఐదు జిల్లాలుగా మారాయి. ఏలూరు జిల్లా కేంద్రంగా ఏలూరు, దెందులూరు, చింతలపూడి, కైకలూరు, ఉంగుటూరు, పోలవరం, నూజివీడు అసెంబ్లీ నియోజకవర్గాలుంటాయి. భీమవరం జిల్లా కేంద్రంగా పాలకొల్లు, ఉండి, నరసాపురం, ఆచంట, తాడేపల్లిగూడెం, తణుకు, భీమవరం నియోజకవర్గాలుంటాయి.

## అంబానీ స్థానంలో ఆదానీ



ముంబై, జనవరి 27, (న్యూస్ పల్స్)భారతదేశంలో అత్యంత సంపన్నుడ ఎవరు అంటే దాదాపు అందరూ ముఖేష్ అంబానీఅని అంటారు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి మారిపోయింది. ఏళ్లుగా నెంబర్ వన్‌గా నిలుస్తూ వచ్చిన అంబానీ.. ఇప్పుడు డౌన్ ఫాల్ అయ్యారు. ఇప్పుడు భారతదేశంలో అత్యంత సంపన్నుల జాబితాలో అగ్రస్థానంలో అదానీ గ్రూప్స్ అధినేత గౌతమ్ అదానీ నిలిచారు. రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముఖేష్ అంబానీ రెండో ప్లేస్‌కి వచ్చారు. ఈ మేరకు ఫోర్బ్స్ రియల్ టైమ్ డేటా నెట్‌వర్త్ జాబితాను ప్రకటించింది.కొన్ని రోజులుగా దేశీయ స్టాక్ మార్కెట్‌లో రిలయన్స్ షేర్స్ పతనం కారణంగా.. రిలయన్స్ గ్రూప్ తీవ్రంగా నష్టపోయింది. ఫలితంగా ముఖేష్ అంబానీ సంపద క్షీణించింది. దాంతో ఆయన నెంబర్ 2కి పడిపోయారు. ఇదే సమయంలో అదానీ గ్రూప్ షేర్లు భారీగా పుంజుకున్నాయి. భారీ స్థాయిలో అమ్మకాలు జరిగాయి. దాంతో గౌతమ్ అదానీ నికర విలువ పెరిగింది. ఫలితంగా ముఖేష్ అంబానీని వెనక్కి నెట్టి.. గౌతమ్ అదానీ రిచెస్ట్ పర్సన్‌గా నిలిచారు. ఫోర్బ్స్ ప్రకారం.. గౌతమ్ అదానీ సంపద రూ. 6.72 లక్షల కోట్లు(90 బిలియన్ డాలర్లు) కాగా, ముఖేష్ అంబానీ సంపద రూ. 6.71 లక్షల కోట్లు (89.8 బిలియన్ డాలర్లు)గా ఉంది.ఇక భారతదేశంలోని అత్యంత ధనవంతుల జాబితాలో నంబర్ వన్ స్థానంలో ముఖేష్ అంబానీ చాలా కాలం పాటు నిలిచారు. ఆయనతో పోటీ పడినవారే లేరు. కానీ, గత కొంతకాలంగా గౌతమ్ అదానీ, ముఖేష్ అంబానీ గ్రూప్స్ మధ్య గట్టి పోటీ నెలకొంది. మొత్తానికి ముఖేష్ అంబానీని బీట్ చేసి అదానీ ఫస్ట్ ప్లేస్‌లో నిలిచి దేశంలోనే రిచెస్ట్ పర్సన్ అయ్యారు.

# బ్రాండెడ్ పేరుతో పాపాలు

విజయవాడ, హైదరాబాద్, జనవరి 27, (న్యూస్ పల్స్)దేవుడి అభిషేకానికి, మన ఆరోగ్యానికి పాలు ఎంతో శ్రేష్టమైనవి. నిజమే..కానీ డిమాండ్ అండ్ సప్లయ్ లాజిక్‌తో పాల చాటున పాపాలు పెరుగుతున్నాయి. మేడిపండు సామెతలా మిల్క్ డెయిరీల్లో పొగలు కక్కుతోన్న కల్తీ ప్రజారోగ్యాన్ని కాటేస్తోంది. గంగిగోవు పాలు గరిటెడైనను చాలు..కరెస్టే. కానీ కడవలు కాదు ట్యాంకుల కొద్దీ తయారవుతోన్న ఇదిగో కల్తీ పాలు తాగితే మృత్యుపాలు కావడం ఖాయం. ఔను..పాపాల బైరవులు బయలెల్లారు. కాసుల కక్కుర్తితో ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్నారు. కల్తీ పాల దందాలో ఏపీ, తెలంగాణ దేశంలోనే టాప్. కానీ ఉక్కుపాదం మోపడంతో ఖేల్ కతమ్..కల్తీ దుక్నం బంద్ అయిందనుకున్నారంత. కానీ మిల్క్ మాఫియా పాపాలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయనే నిజం తాజాగా తెరపైకి వచ్చింది. హైదరాబాద్ శివారు సంగారెడ్డి జిల్లా పాశమైలారం పారిశ్రామికవాడలోని పవిత్ర డెయిరీ బాగోతం బయటపడిందిపేరుకి పవిత్ర డెయిరీ ప్రైవేట్ లిమిటెడ్. కానీ లోపలం జరుగుతున్న తతంగం మాత్రం పాలకూట విషం. అవును.. కల్తీ పాలు, పెరుగు, పన్నీరు.. ఇలా అన్నింటిని కెమికల్స్‌తో తయారు చేస్తూ ప్రముఖ బ్రాండ్ల పేరుతో విక్రయిస్తున్నారు. అమూల్, హెరిటేజ్, గోవర్ధన్ లాంటి కంపెనీల స్టిక్కర్లు అంటించి మార్కెట్‌లో మాయచేస్తున్నారు. పక్కా సమాచారంతో డీఎస్పీ భీంరెడ్డి ఆధ్వర్యంలో పవిత్ర డెయిరీలో సోదాలు జరిపితే కల్తీ కుతంత్రం బయటపడింది. కల్తీ పాలు, పెరుగు తయారీ కోసం యూరియా, డిటర్జెంట్, స్టార్చ్.. మంచి వాసన కోసం కొన్ని రకాల రసాయనాలను వాడుతున్నారు. గంటల వ్యవధిలో గడ్డ పెరుగు తయారు చేస్తున్నట్టు గుర్తించారు. పాలు, పెరుగుకి ఉన్న డిమాండ్‌ను క్యాష్ చేసుకుంటూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు.కల్తీపాలను ప్రముఖ సంస్థల లేబుళ్లతో హోటళ్లు, రెస్టారెంట్లు, కిరణా షాప్స్‌కి సప్లయ్ చేస్తున్నారు. తక్కువ ధరకు రావటం, కల్తీ ఉత్పత్తులు అని గుర్తించే అవకాశం లేకపోవటం దందాకు అనుకూలంగా మారిందంటున్నారు పోలీసులు. కల్తీ ఉత్పత్తులకి సంబంధించి 6వేల లీటర్ల పౌడర్‌ను సీజ్ చేశామన్నారు పోలీసులు. పవిత్ర డెయిరీ అపవిత్ర పాల దందా సెటప్ చూసి పోలీసులే కంగుతిన్నారు. ఈ తంతు ఎన్నాళ్లుగా సాగుతోంది. ఎవరి అండదండలతో? కల్తీ చేయడం నేరం. పేరున్న బ్రాండ్ల పేరిట మార్కెటింగ్ చేయడం మరో మోసం. ఈ గోల్‌మాల్ ఓ లెక్కయితే. ఇక పల్లెబాటలో డెయిరీలకు విక్రయిస్తున్న పాలలో కూడా విషం పాలే ఎక్కువ. పాలలో చిక్కదనం కోసం.. వెన్నశాతం ఎక్కువగా చూపడం కోసం ఏకంగా యూరియా, సన్‌ఫ్లవర్ ఆయిల్ సహా రకరకాల కెమికల్స్‌ను కలుపుతున్నారు.దొరికితే దొంగ. దొరకనంత వరకు దర్జా దోచుకోవచ్చు. పాలలో నీళ్లు కలిపితే కక్కుర్తి అని సరిపెట్టుకోవచ్చు. కానీ ఏకంగా కెమికల్స్ మిక్స్ చేస్తున్నారు. మరి కల్తీ పాలను గుర్తించడం ఎలా?..జాగ్రత్తగా పరిశీలిస్తే కల్తీ పాలను గుర్తించవచ్చు. వాసన పసిగట్టినా అసలా.. నకిలా అన్న తేడా తెలిసిపోతుంది. నేలపై వేసినప్పుడు కల్తీ పాలైతే వాటిలో ఎక్కువ కదలిక ఉండదు. కల్తీ పాలు, కల్తీ పెరుగులను కొంటే.. విషం తిన్నట్టే. వాటిలో వాడే కెమికల్స్ వల్ల ఆరోగ్యానికి ఎంతో హాని వుందంటున్నారు వైద్యులు. కల్తీ మిల్క్ ప్రొడక్ట్సులో క్లాస్టిడ్మిం, ఈకోలై, సాల్మానెల్లా ప్రమాదకర బ్యాక్టీరియాతోపాటు రోటా వైరస్ కూడా ఉంటుంది. గ్యాస్ట్రిక్ సమస్యలు, వాంతులు, వీరేచనాలు, కడుపులో తిప్పడం, అల్సర్లు వంటి సమస్యలు ఉత్పన్నమవుతాయి. అంతే క్యాన్సర్ బారిన పడే అవకాశాలు అధికం. ఇలాంటి కల్తీ పాలను తాగిస్తే పిల్లల్లో శారీరక, మానసిక ఎదుగుల లోపిస్తుంది.దేశమంతటా కల్తీ పాల దందా జోరుగా సాగుతోంది. ఆ తెగులు మన తెలుగు రాష్ట్రాల్లో మరింత ఎక్కువగా వుంది. ప్రభుత్వాలు ఉక్కుపాదం మోపినా సరే పల్లె నుంచి పట్నం దాకా కల్తీ కాటు తప్పడం లేదు. బ్రాండెడ్ నమ్మకానికి కూడా గండి కొడుతున్నారు పవిత్ర డెయిరీ వంటి కేటుగాళ్లు. పాలే కదా అని ఉపేక్షిస్తే కల్తీ కాటు సమాజానికే చేటు. మీ చుట్టుపక్కల ఎవరైనా కల్తీకి పాల్పడితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వండి. కల్తీ మాఫియాను కట్టడి చేయడం మనందరి బాధ్యత.

# మళ్లీ ఆందోళన ఉధృతంగా స్టీల్ ప్లాంట్ ఉద్యోగులు



విజయవాడ, జనవరి 27, (న్యూస్ పల్స్) ఆంధ్రప్రదేశ్ రాజకీయ నేతల గురించి.. పార్టీల గురించి పాపం కార్మికులకు, రైతులకు పెద్దగా అవగాహన ఉన్నట్లు లేదు. తమకు అవసరం ఉన్న సమయంలోనే వారు అండగా నిలుస్తారు. లేదంటే సైడయి వెళ్లిపోతారు. అమరావతి రాజధాని ఉద్యమాన్ని కూడా అన్ని పార్టీలూ అలా పైకి లేపి, చివరకు వారి మానాన వారిని వదిలేశాయి. ఇక విశాఖ స్టీల్ ప్లాంట్ కార్మికుల పరిస్థితి కూడా అంతే. వచ్చే నెల 12వ తేదీ నాటికి విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా నిరసన చేపట్టి ఏడాది కావస్తుంది. విశాఖ స్టీల్ ప్లాంట్ కు వ్యతిరేకంగా తొలినాళ్లలో అన్ని పార్టీలు గట్టిగానే మద్దతిచ్చాయి. వైసీపీ కార్మికులకు మద్దతుగా విశాఖపట్నంలో పాదయాత్ర చేసింది. ఇక టీడీపీ అయితే ఏకంగా ఆమరణ దీక్షకు దిగింది. ఆ పార్టీ నేత పల్లా శ్రీనివాసరావు స్టీల్ ప్లాంట్ ను ప్రయివేటీకరించవద్దంటూ ఆ పార్టీ నేత పల్లా శ్రీనివాసరావు దీక్షకు దిగితే స్వయంగా టీడీపీ అధినేత చంద్రబాబు వెళ్లి పరామర్శించి వచ్చారు ఇక జనసేన పార్టీ గురించి చెప్పాల్సిన పనిలేదు. పవన్ కల్యాణ్ కార్మికులకు అండగా విశాఖ వెళ్లి దీక్షలో పాల్గొన్నారు. అంతేకాదు విశాఖ స్టీల్ ప్లాంట్ విషయంలో వైసీపీ ప్రభుత్వం చేస్తున్న వ్యవహారాన్ని నిరసించారు. వెంటనే దీనిపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేస్తూ మంగళగిరి పార్టీ కార్యాయంలో ఎనిమిది గంటల పాటు ఆయన దీక్షకు దిగి స్టీల్ ప్లాంట్ కార్మికులకు సంఘీభావం తెలిపారు. అయితే ఇదంతా కేవలం రాజకీయాల కోసమే మూడు పార్టీలూ చేస్తున్నాయి. అధికార వైసీపీ కేంద్ర ప్రభుత్వంతో దీనిపై ఎటువంటి చర్చలు జరపలేదు. జగన్ ఢిల్లీ వెళ్లి ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షాను కలిసినా ఈ విషయాన్ని ప్రస్తావించలేదంటారు. ఇక బీజేపీలో మిత్రపక్షంగా కొనసాగుతున్న జనసేన కూడా బీజేపీ పెద్దలను కలిసే ప్రయత్నం చేయలేదు. ఇక తెలుగుదేశం పార్టీ కూడా ఇందుకు మినహాయింపు కాదు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీని ప్రశ్నించే సాహసం చేయలేకపోతుంది. పాపం కార్మికులే ఏడాదిగా ప్లాంట్ ను రక్షించుకోవడం కోసం పోరాడుతున్నారు. ఆరాటపడుతున్నారు. ఈ రాజకీయ పార్టీలు మాత్రం వారిని ఓటు బ్యాంకులుగానే చూస్తున్నాయన్నది వాస్తవం. వచ్చే నెల 23న విశాఖ స్టీల్ ప్లాంట్ కార్మికులు రాష్ట్ర బంద్ కు పిలుపునిచ్చారు. ఆ బంద్ లో మాత్రం అన్ని పార్టీలు పాల్గొని మరోసారి మోసం చేసే ప్రయత్నం చేస్తాయి.

## జూట్ మిల్లు లాకౌట్ ఉద్రిక్తత

ఏలూరు పశ్చిమగోదావరి జిల్లా ఏలూరులో ప్రసిద్ధి చెందిన కృష్ణా జూట్ మిల్లుకు యాజమాన్యం లాకౌట్ ప్రకటించింది. దీంతో రెండువేల మంది కార్మికులు రోడ్డున పడ్డారు. జనపనార కొరత, అధిక రేటు వలన మిల్లును మూసేసినట్లు యాజమాన్యం తెలిపింది. అయితే ఫ్యాక్టరీ తెరవాలని కార్మికులు ఆందోళనకు దిగారు. ఈ నేపథ్యంలో పోలీసులు భారీగా మోహరించారు. ఆకస్మాత్తుగా మూసివేస్తే కుటుంబంతో సహా రోడ్డున పడతం అంటూ కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## ప్రకాశంలో ఉసురు తీస్తున్న అప్పులు

ఒంగోలు, జనవరి 27, (న్యూస్ పల్స్)ప్రకాశం జిల్లా పామూరు మండలం ఎనిమెర్ల గ్రామానికి చెందిన రైతు ఒంటిపెంట లక్ష్మీనరసారెడ్డి (52), అతని భార్య వెంకటలక్ష్మమ్మ (48) రెండెకరాల సొంత పొలంతోపాటు మరో ఐదెకరాలు కౌలుకు తీసుకొని మిర్చి, పొగాకు సాగు చేశారు. వ్యవసాయం చేసుకుంటూనే పొగాకు బ్యారెన్ నడిపారు. గత పదేళ్లుగా వ్యవసాయంలో నష్టాలు రావడంతో అసలుతో పాటు వడ్డీలు పెరిగి దాదాపు రూ.30 లక్షల వరకు అప్పు తేలింది. అప్పు తీర్చే మార్గం లేకపోవడంతో లక్ష్మీనరసారెడ్డి భార్యతో కలిసి ఆత్మహత్య చేసుకున్నారు.యద్దనపూడి మండలం గన్నవరం గ్రామానికి చెందిన దళిత రైతు అద్దెపల్లి ఆనందరావు (32) పది ఎకరాల్లో మిర్చి పంట సాగు చేశాడు. ఇటీవల కురిసిన అకాల వర్షాలతో పంట మొత్తం దెబ్బతింది. సాగు నిమిత్తం రూ.10 లక్షల వరకు అప్పులు చేశాడు. రుణదాతల ఒత్తిడితో అప్పులు తీర్చలేక ఆత్మహత్య చేసుకున్నాడుతర్లుపాడు మండలంలోనూ ఇటీవలే రెండు కుటుంబాలకు చెందిన రైతులు అప్పుల బాధతోనే ఆత్మహత్య చేసుకున్నారు. ఇద్దరూ ఒకే రోజు చనిపోయారు. పంట నష్టాలతో పాటు అప్పులే వీరిని బలిగొన్నాయి.ప్రకాశం జిల్లాలో ఇలా నెలరోజుల్లో తొమ్మిది మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. పండించిన అరకొర పంటలకు గిట్టుబాటు ధరల్లేవు. వ్యవసాయంలో పెట్టిన ప్రతిపైసా తిరిగి రాకపోగా నష్టాలు చుట్టుముడుతున్నాయి. బతుకుపై ఆశలు సన్నగిల్లుతున్నాయి. కనీసం పంట నష్టపరిహారాలు కూడా ప్రభుత్వాలు అందించడంలేదు. పంట కోసం రైతులు చేస్తున్న అప్పులు.. చివరికి వారి ఉసురు తీస్తున్నాయి.జిల్లా వ్యాప్తంగా సుమారు లక్ష ఎకరాల్లో మిర్చి పంటను సాగు చేశారు. నవంబరులో కురిసిన భారీ వర్షాలకు తామర, ఆకుముడత తెగులు సోకి పంట మొత్తం చేజారింది. ప్రభుత్వం నుంచి కేంద్ర బృందాలు వచ్చి నష్టపోయిన పంటలను పరిశీలించి వెళ్లాయేగానీ ఇప్పటికీ ఒక్క పైసా రైతులకు అందజలేదు. దీంతో మిర్చి నష్టపోయిన రైతులు తీవ్ర నష్టాల్లో కూరుకుపోయారు. దీంతో ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. సంతమాగులూరు మండలం ఏల్చూరు గ్రామానికి చెందిన అంకంశెట్టి హనుమంతరావు (25) అనే రైతు 12 ఎకరాల్లో మిర్చి సాగు చేశాడు. ఇటీవల కురిసిన వర్షానికి పంట మొత్తం దెబ్బతింది. సాగు నిమిత్తం రూ.11 లక్షల వరకు అప్పులు చేశాడు. అప్పు తీరే మార్గం లేక ఆత్మహత్య చేసుకున్నాడు. పర్చూరు మండలం నూతలపాడు గ్రామానికి చెందిన వెంకటరెడ్డి పది ఎకరాల్లో మిర్చితో పాటు ఇతర పంటలు వేశాడు. రూ.30 లక్షలు అప్పులు తేలాయి. దీంతో ఆయనా ఆత్మహత్యనే దారిగా ఎంచుకున్నాడు. బేస్తవారిపేట మండలం పిటకాయగుళ్లలో చిలకల ఈశ్వర్‌రెడ్డి, మార్కాపురం మండలం బొందలపాడులో తవనం అచ్చిరెడ్డి, తర్లుపాడు మండలం పోతలపాడులో మూడమంచు భూరంగయ్య, గానుగపెంటలో గాయం సత్యనారాయణరెడ్డి ఆత్మహత్య చేసుకున్నారు. అందరూ అప్పులబాధతోనే ప్రాణాలు తీసుకున్నారు. కుటుంబాలు చిన్నాభిన్నమయ్యాయి. కుటుంబ పెద్దలను కోల్పోవడంతో పిల్లల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

## విద్యుత్ కేంద్రం ఉద్యోగుల ఆందోళన

### ఆదానికి అప్పచెబుతున్నారని ఆరోపణ

నెల్లూరునెల్లూరుజిల్లా ముత్తుకూరు మండలం నేలటూరు లో శ్రీ దామోదరం సంజీవయ్య తాప విద్యుత్ కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తులకు అప్పగించేందుకు జగన్ సర్కార్ ప్రణాళిక సిద్ధం చేసిందని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు..లీజు పేరుతో ప్రభుత్వ రంగ విద్యుత్ ఉత్పత్తి సంస్థ ఎస్డీఎస్టిపిఎస్ ను అమ్మేందుకు ప్రభుత్వం సిద్ధం అవడంతో జెన్కో ఉద్యోగులు,కాంట్రాక్టు ఉద్యోగులు, సిబ్బంది ప్లాంట్ మెయిన్ గేట్ ముందు ఆందోళనకు దిగారు. అప్పుల పేరుతో ప్రాజెక్టు నష్టాలలో ఉందనే సాకుతో ప్రభుత్వం ఇలాంటి నిర్ణయం తీసుకోవడం దుర్మార్గపు చర్యగా చెప్పారు. ఈ విద్యుత్ కేంద్రం కోసం వేల ఎకరాల భూమిని ధారపోసిన స్థానికుల బతుకులు అంధకారంలో వెళ్లిపోతాయని భూములు కోల్పోయిన వారి భవిష్యత్తు గురించి ప్రభుత్వం ఆలోచన చేసి ప్రైవేటీకరణ అనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. స్థానికులకు అన్యాయం జరిగితే ఎవరు సహించరని, దశల వారీగా న్యాయపరమైన పోరాటం చేసేందుకు రాష్ట్ర జేఏసీ నిర్ణయం ప్రకారం ఏ స్థాయి పోరాటానికైనా సిద్ధంగా ఉన్నామని తెలియజేశారు.

## జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం...ఇద్దరు మృతి

ఒంగోలుచెన్నై- కలకత్తా 16వ నెంబరు జాతీయ రహదారిపై ప్రకాశం జిల్లాలో గురువారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. జె.పంగులూరు మండలం రేణంగివరం వద్ద సుబాబుల్ లోడు ట్రాక్టర్ ను వెనుక నుంచి కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదానికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. చిలకలూరిపేట పట్టణంలోని పండరీపురం వాటర్ ట్యాంకు ఎదురు సోదా వెంకట్రావు, కళావతి దంపతులు కిరాణా దుకాణం నిర్వహిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు ప్రసన్న, భాస్కర్ లు ఉన్నారు. పెద్ద కుమారుడు సాఫ్ట్ వేర్ ఇంజనీర్ గా పని చేస్తున్నాడు. చిన్న కుమారుడు భాస్కర్ ను అమెరికా పంపించేందుకు చెన్నై ఎయిర్పోర్ట్ కు కారులో బుధవారం రాత్రి వెళ్లారు. ఫ్లైట్ ఎక్కించి వెంకట్రావు, కళావతి, ప్రసన్నలు తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో ప్రమాదం జరిగింది. వీరిలో వెంకటరావు, ప్రసన్న లు మృతి చెందగా కళావతి, డ్రైవర్ తీవ్రంగా గాయపడటంతో ఆస్పత్రికి తరలించారు. పొద్దు పొద్దున్నే ఈ విషాద వార్త అందడంతో చిలకలూరిపేట పట్టణంలోని సాంబశివ నగర్ ప్రాంతంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# ఒమిక్రాన్ 21 గంటల పాటు లైఫ్




ముంబై, జనవరి 27, (న్యూస్ పల్స్) కరోనా కొత్త వేరియంట్ ఒమిక్రాన్ చాలా వేగంగా వ్యాప్తి చెందుతోంది. గతంలో డెల్టా కంటే మూడింతల వేగంగా కొత్త వేరియంట్ వ్యాప్తి చెందుతున్నట్లు శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ క్రమంలో ఒమిక్రాన్‌పై తాజాగా జపాన్‌లోని క్యోటో ప్రిఫెక్చరల్ యూనివర్సిటీకి చెందిన సైంటిస్టులు దీనికి గల కారణాలపై పరిశోధన చేశారు. ఒమిక్రాన్ వేగంగా వ్యాప్తి చెందడానికి ఈ వేరియంట్ వస్తువులపై ఎక్కువ సమయం బతికి ఉండడమే కారణమని తేల్చారు. ఒమిక్రాన్ వేరియంట్ మనిషి చర్మంపై 21 గంటల పాటు బతికి ఉంటుందని తమ అధ్యయనంలో తేలినట్లు సైంటిస్టులు వెల్లడించారు. ప్లాస్టిక్ వస్తువులపై అయితే ఏకంగా ఎనిమిది రోజుల పాటు ఒమిక్రాన్ సజీవంగా ఉంటుందని తేల్చారు. ఈ నేపథ్యంలో జనం.. కొత్త వేరియంట్ విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలని, భౌతిక దూరం పాటించడం, మాస్కులు ధరించడం, క్రమం తప్పకుండా చేతులు శానిటైజ్ చేసుకోవడం చాలా అవసరమని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.చైనాలోని వుహాన్ ల్యాబ్ నుంచి తొలుత వచ్చిన కరోనా వైరస్ స్ట్రెయిన్‌గా భావిస్తున్న దానితో పోలిస్తే ఆల్ఫా, బీటా, డెల్టా, ఒమిక్రాన్ వేరియంట్ల లైఫ్ ప్లాస్టిక్, చర్మంపై చాలా ఎక్కువగా ఉందని గుర్తించినట్లు కేపీ యూనివర్సిటీ సైంటిస్టులు తెలిపారు. తమ స్టడీ వివరాలు బయోరిక్సివ్ సైన్స్ జర్నల్‌లో పబ్లిష్ అయ్యాయన్నారు. కొత్త వేరియంట్‌కు ఉన్న హై ఎన్విరాన్‌మెంటల్ సస్టైనబిలిటీ వల్ల కాంటాక్ట్ ద్వారా ఎక్కువ మందికి వైరస్ అంటుకుంటోందని, దీని వల్లే స్ప్రెడ్ చాలా తీవ్రంగా ఉందని, పబ్లిక్ అప్రమత్తతే రక్షణ అని చెప్పారు. సగటున ప్లాస్టిక్ వస్తువులపై వుహాన్ నుంచి వచ్చిన ఒరిజినల్ వేరియంట్ లైఫ్ 56 గంటలు ఉంటే, ఆల్ఫా 191.3 గంటలు, బీటా 156.6 గంటలు, గామా 59.3 గంటలు, డెల్టా 114 గంటలు సజీవంగా ఉన్నట్లు సైంటిస్టులు తెలిపారు. చర్మంపై ఉండే ఆల్ఫా, బీటా, డెల్టా, ఒమిక్రాన్ వేరియంట్లను శానిటైజర్ సులభంగా అంతం చేస్తుందని సైంటిస్టులు స్పష్టం చేశారు. 35 శాతం ఇథనాల్ ఉన్న శానిటైజర్ వాడినా కేవలం 15 సెకన్లలోనే వైరస్ ఖతమైతదని పేర్కొన్నారు. ఏదైనా వస్తువులను తాకిన తర్వాత మన చేతులకు వైరస్ అంటుకున్నా శానిటైజర్‌తో చంపేయొచ్చని, అందుకే డబ్ల్యూహెచ్‌వో సూచించిన ప్రకారం శానిటైజర్లతో చేతులు శుభ్రం చేసుకోవాలని శాస్త్రవేత్తలు చెప్పారు

## పాత రథచక్రాలకు నిప్పు పెట్టిన దుండగులు


చిత్తూరుప్రసిద్ధ పుణ్యక్షేత్రం కాణిపాక ఆలయంలో దారుణం చోటు చేసుకుంది. పాత రథ చక్రాలకు గుర్తుతెలియని దుండగులు నిప్పు పెట్టారు. గోశాల పక్కన నిల్వ ఉంచిన పాత రథచక్రాలు అగ్నికి ఆహుతయ్యాయి. ఇది గుర్తు తెలియని వ్యక్తులు చేసిన పనా లేక కావాలని ఇంకెవరైనా చేశారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విషయం తెలిసిన పోలీసులు అక్కడకు చేరుకుని విచారణ ప్రారంభించారు.

## మేడారం జాతరలో అపశృతి మూర్ఛతో వృద్ధుడి మృతి

ములుగుములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం జాతర లో అపశృతి జరిగింది. సమ్మక్క సారలమ్మ ల దర్శనం కోసం క్యూలైన్ లో నిలబడి ఉన్న వెంకట నారాయణ (65) మూర్ఛ వచ్చి పడిపోయాడు. బాధితుడికి వైద్య సహాయం అందకముందే మృతి చెందాడు. మృతుడు భద్రాద్రి కొత్త గూడెం జిల్లా పాల్వంచ కు చెందిన వ్యక్తి గా గుర్తించారు.

## బతుకమ్మ చీరలు.. చిరిగి... పేలికలుగా...

కరీంనగర్, జనవరి 27, (న్యూస్ పల్స్) కేసీఆర్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తయారు చేయించిన బతుకమ్మ చీరలు మూల పడ్డాయి. సిరిసిల్ల ఇందిరా నగర్ మార్కెట్ యార్డు గోదాముల్లో వందలకొద్ది బతుకమ్మ చీరలు నిర్లక్ష్యంగా నిల్వ చేశారు. గత ఏడాది పంపిణీ చేయగా మిగిలిన చీరలు నిల్వ చేయగా... అవి కాస్త చిరిగిపోయి చీలికలు, పేలికలుగా మారుతున్నాయి. చీరల్ని సక్రమంగా భద్రపరచకపోవడంతో చెల్లా చెదురుగా పడి చీలికలుగా పాడయ్యాయి. మిగిలిపోయిన చీరలను వచ్చే ఏడాది పంపిణీ చేసేందుకు వీలుగా వీటిని మూడు చోట్ల భద్రపరిచామని అధికారులు చెబుతున్నారు. వ్యవసాయ మార్కెట్ యార్డులో ఉంచిన బతుకమ్మ చీరలకు భద్రంగా ఉంచేందుకు తగిన చర్యలు తీసుకుంటామని చెబుతున్నారు. గత సంవత్సరం దాదాపు రూ. 300 కోట్లు వెచ్చించి 6.80 కోట్ల మీటర్ల క్లాత్ సేకరించగా సుమారు రూ. 50 కోట్ల విలువ చేసే 1.30 కోట్ల మీటర్ల క్లాత్ ఇక్కడి గోదాముల్లో స్టాక్ నిలిచిపోయింది. ఈ చీరెలను సిరిసిల్లలోని గోదాముల్లో నిల్వ ఉంచిన అధికారులు వచ్చే సంవత్సరం పంపిణీ చేయాలని భావిస్తున్నట్టుగా సమాచారం. దీంతో ఈ ఏడాది బతుకమ్మ చీరలను 1.30 కోట్ల మీటర్లకు పరిమితం చేశారు. అయితే రాష్ట వ్యాప్తంగా ఆర్భాటంగా పంపిణీ చేసే బతుకమ్మ చీరలను కాపాడే విషయంలో ప్రత్యేక దృష్టి సారించడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. సిరిసిల్ల ఏఎంసీ ఆవరణలో చిరిగిపోయిన చీరల ముక్కలు పడిపోతున్నా పట్టించుకునేవారే లేకుండా పోయారని పలువురు ఆరోపిస్తున్నారు.



# మహా పూర్ణాహుతితో ముగిసిన నవకుండాత్మక శ్రీ యాగం

తిరుపతి ప్రపంచ శాంతి, సౌభాగ్యం కోసం శ్రీ పద్మావతి అమ్మవారిని ప్రార్థిస్తూ జనవరి 21 నుండి ఏడు రోజుల పాటు తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో నిర్వహించిన నవకుండాత్మక శ్రీయాగం గురువారం మహాపూర్ణాహుతితో ముగిసింది. కోవిడ్-19 వ్యాప్తి నేపథ్యంలో ఆలయంలోని శ్రీకృష్ణ ముఖ మండపంలో అర్చకులు వేంపల్లి శ్రీనివాసన్ ప్రధానాచార్యులుగా ఏకాంతంగా ఈ యాగం నిర్వహించారు. ఈ యాగ కార్యక్రమాలను శ్రీ వేంకటేశ్వర భక్తి ఛానల్ ప్రత్యక్ష ప్రసారం చేసింది. ఉదయం 6.30 నుండి 8.30 గంటల వరకు చతుష్టానార్చన, హోమాలు, మహాప్రాయశ్చిత్త హోమం, మహాశాంతి హోమం నిర్వహించారు. ఉదయం 8.30 నుండి 9.30 గంటల వరకు మహాపూర్ణాహుతి నిర్వహించారు అనంతరం అభిషేకం మరియు అవభృతం నిర్వహించారు. టీటీడీ చైర్మన్ వైవి సుబ్బారెడ్డి దంపతులు నిర్వహింపచేసిన ఈ యాగంలో కంచిపీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విజయేంద్ర సరస్వతి, టీటీడీ పాలకమండలి సభ్యులు పోకల అశోక్ కుమార్ దంపతులు, డిప్యూటీ ఈవో కస్తూరి భాయి, ఏఈవో ప్రభాకర్ రెడ్డి, అర్చకులు బాబు స్వామి పాల్గొన్నారు.

### ప్రభుత్వ ఉద్యోగుల పై వైసీపీ నాయకుల దాడి

విశాఖపట్నం విశాఖ లో ప్రభుత్వ ఉద్యోగుల పై వైసీపీ నాయకుల దాడి చేసారు. ప్రభుత్వ భూమిలో ఆక్రమణను తొలగిస్తున్న అధికారుల పై దాడి జరిగింది. వైసీపీ వెస్ట్ నియోజకవర్గ ఇంచార్జ్ మళ్ళా విజయ ప్రసాద్ అనుచరుల ఆధ్వర్యంలో 80 సెంట్లు భూమి ఆక్రమణ జరిగినట్లు అధికారులు గుర్తించారు. పెందుర్తి మండలం సత్తివాణిపాలం గ్రామంలో సర్వే నెంబర్ 355 చెందిన గడ్డ వాగు ఆక్రమణకు గురయింది. గురువారం నాడు ఆక్రమణలు తొలగిస్తున్న ఆర్.ఐ, వీఆర్వో పై 89వ వార్డ్ వైసీపీ ఇంచార్జ్ దొడ్డి కిరణ్ ,అతనిఅనుచరులుదాడి చేసారు. దాడిని వీడియో తీస్తున్న వీఆర్వో అన్నరెడ్డి శంకర్ పై వీడియో చిత్రీకరించకూడదు అంటూ దాడి జరిపారు.

## కర్నూలు జిల్లాకు సంజీవయ్య పేరు పెట్టాలి

### సీఎం జగన్ కు వీహెచ్ వినతి

హైదరాబాద్ కర్నూల్ జిల్లాకు సంజీవయ్య పేరు పెట్టాలనీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికి కాంగ్రెస్ నేత వి హనుమంతరావు లేఖ రాసారు. గురువారం అయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర గవర్నర్ ని కెసిఆర్ అవమానించారు. రిపబ్లిక్ డే వేడుకలు కెసిఆర్ వెళ్లకపోవడం అన్యాయమని అన్నారు.ఈ విషయంలో గవర్నర్ ని కలుస్తా . అంబేద్కర్ గురించి రేవంత్ రెడ్డీ గొప్పగా చెప్పాడు. . పంజాగుట్ట లో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు కోసం కూడా రేవంత్ మాట్లాడాలి. ఎస్సిల ద గౌరవం ఉంటే కెసిఆర్ పంజాగుట్టలో అంబేద్కర్ విగ్రహం పెట్టాలని అన్నారు.పార్టీలో అరు సార్లు నాకు అవమానం జరిగింది. రేవంత్ నన్ను రైతు సమస్యలపై మంచిర్యాల వెళ్ళాలి అని చెప్పారు..వెళ్ళిన. మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్ సాగర్ రావు మనుషులు మా పై దురుసుగా మాట్లాడారు. రేపు మౌన వ్రతం చేద్దాం అనుకున్న. ప్రేమ్ సాగర్ రావు కు షోకాజ్ నోటీసు ఇస్తా అని క్రమశిక్షణ కమిటీ మాట ఇచ్చింది. నోటీసు ఇవ్వకపోతే మౌన దీక్ష చేస్తానని అన్నారు.

# బాధ్యతలు నిర్వర్తించని అధికారులను సస్పెండ్ చేయాలి



**ఆర్థిక బహిష్కరణ జరుగుతున్న సందర్శించని కోడుమూరు ఎమ్మెల్యేను బర్తరఫ్ చేయాలి**

**సమస్య పరిష్కారానికై జనవరి 31న జరిగే కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయండి**

శేరిలింగంపల్లి జనవరి 27 ( విభారె) దళితులపై కొనసాగుతున్న అంటరానితనాన్ని, దౌర్జన్యాలను అరికట్టి వాటిని ప్రోత్సహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కర్నూలు ధర్నా చౌక్ వద్ద జరుగుతున్న రెండవ రోజు నిరాహార దీక్షలను రైతు సంఘం రాష్ట్ర నాయకులు కె ప్రభాకర రెడ్డి, సీనియర్ దళిత నాయకులు హైకోర్టు న్యాయవాది ఎగ్గోని జయరాజు దీక్ష లో కూర్చున్న కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం డి ఆనంద్ బాబు, జిల్లా నాయకులు కనకవీడు రాజు, సుధాకర్, లక్ష్మణ్, విజయ, రాణెమ్మ తదితరులకు దండలువేసి దీక్షలు ప్రారంభించారు. కెవిపిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి సందె పోగు సత్యం అధ్యక్షతన జరిగిన దీక్ష కార్యక్రమాన్ని ఉద్దేశించి కె ప్రభాకర రెడ్డి, వై జయరాజు, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు పి ఎస్ రాధాకృష్ణ, అంబేద్కర్ స్ఫూర్తి సొసైటీ అధ్యక్షులు సోగరాజు మునయ్య, మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షులు కుందా వెంకటేశ్వర్లు, డి హెచ్ పి ఎస్ జిల్లా కార్యదర్శి మహేష్, దళిత మహిళా నాయకురాలు మంజువాణి, వ్యకాసం, డి వై ఎఫ్ ఐ జిల్లా ఉపాధ్యక్షులు వెంకట్రాముడు, రాఘవేంద్ర ఎస్ ఎఫ్ ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా, ఏ పి డబ్ల్యూ జె ఎఫ్ నాయకులు మునిస్వామి మద్దతుగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆధిపత్య వర్గాల దౌర్జన్యం, ప్రజాప్రతినిధులు, అధికారుల నిర్లక్ష్యం వెరసి నిరుపేదలైన దళితుల బ్రతుకులను మరింత దారిద్ర్యం లోకి, అనాగరిక వ్యవస్థలోకి దిగజారుస్తోందన్నారు. క్రింది స్థాయి నుండి పై స్థాయి దాకా అధికారులందరికీ సమస్యపై విన్నవించిన అనంతరమే, దళితుల సాంఘిక సమానత్వాన్ని కోరుతూ జనవరి 3న అనుగొండలో ప్రతిఘటన కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. అనుగొండ లో కరుడుగట్టిన కుల ఉన్మాదులుగా ఉన్న ఆధిపత్య వర్గాలు, అంటరాని తనాన్ని అలానే ఉంచాలనే కృత నిశ్చయంతో.. దళితులను సాంఘిక బహిష్కరణకు తోడు ఆర్థికంగా కూడా బహిష్కరించారన్నారు. అంటరానితనాన్ని, కుల వివక్షతను నిర్మూలించాల్సిన సాంఘిక సంక్షేమ డిడి కి అది పట్టడం లేదని, ఆర్థిక బహిష్కరణ తో ఆకలి బాధలను అనుభవిస్తున్న దళితులను ఆదుకోవడం పక్కన పెడితే విన్నవించినా కనీసం పలకరించే ప్రయత్నం కూడా చేయని ఆర్ డి ఓ, తహసీల్దార్ లు ఉన్నారన్నారు. ఎస్సీ నియోజకవర్గం లో తమ సామాజిక తరగతులు అంటరానితనాన్ని భరించలేక ఎదిరించి ఆర్థిక బహిష్కరణకు గురైనా ఏ స్వార్థం కోసం ఎమ్మెల్యే మాట్లాడకుండా ఉన్నారో అర్థం కావడం లేదన్నారు. గ్రామంలో వివక్షను వీళ్ళు ప్రోత్సహిస్తున్నారు అని కంప్లైంట్ చేసినా కేసు పెట్టడం లేదన్నారు. దీనిపై కలెక్టర్ ఎస్పీలు స్పందించి అంటరానితనాన్ని నిర్మూలిస్తారా లేదా చట్టబద్ధం చేస్తారా తేల్చాలన్నారు. అనుగొండ, పెద్ద గోనెహాల్ గ్రామాల దళితుల సమస్యల పరిష్కారం కోసం జనవరి 31న నిర్వహించే కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమానికి సంపూర్ణ మద్దతు ఇచ్చి పాల్గొంటామని, ఆ రకంగా ప్రజాతంత్ర వాదులంతా పాల్గొని సహకరించాలని వారు తెలియజేశారు. దీక్షల్లో కెవిపిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి ఆర్ నరసింహులు, నాయకులు కృష్ణ, కర్నూలు మండలం నాయకులు వెంకటేశ్వర్లు, కోడుమూరు మండల కార్యదర్శి సుధాకర్, జిల్లా నాయకులు గురు స్వామి, సుదర్శన్, అనుగొండ బాధితులు సురేష్, కక్కన్న, సురేంద్ర, మౌలాలి, ఆటో నాగరాజు, కమ్మగిరి, దానమయ్య, జిర్రా రంగన్న, హరిబాబు, వెంకటేష్, డప్పు కళాకారుల సంఘం నాయకులు చక్రపాణి, చిన్న రాముడు, దాసు, మునిస్వామి, బజారన్న తదితరులు పాల్గొన్నారు.

## స్నేహ ఫ్రెష్ చికెన్ మరియు మటన్ షాప్ ను ప్రారంభించిన గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి గారు



శేరిలింగంపల్లి ,జనవరి 27నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గోపన్‌పల్లి తండా లో నూతనంగా ఏర్పాటు చేసిన స్నేహ ఫ్రెష్ చికెన్ మరియు మటన్ షాప్ ను ఈ రోజు గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి గారు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి గారు మాట్లాడుతూ స్నేహ ఫ్రెష్ చికెన్ మరియు మటన్ షాప్ ను ఏర్పాటు చేయడంతో స్థానికులకు అందుబాటులోకి రావడం జరిగిందన్నారు. మార్కెట్ లో ఉన్న పోటీని తట్టుకుని మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు.కష్టమర్లకు నాణ్యమైన సేవలు అందించి, వారి మన్ననలు పొందాలని నిర్వాహకులకు ఆయన సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ నియామకాలు చేపట్టకపోవడంతో, యువత స్వయం ఉపాధి పొందే మార్గం వైపు రావడం జరుగుతుందన్నారు.

# మెగా మేళా ను విజయవంతం చేయండి



**:-వన్ టైమ్ సెటిల్మెంట్ (ఓటిఎస్) రిజిస్ట్రేషన్ల ప్రక్రియను వేగవంతం చేయండి**

**:-జగనన్న కాలనీలలో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి**

**:-టెలీ కాన్ఫరెన్స్ లో అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వర రావు**

కర్నూలు, నవంబర్ 27( విభారె) :-ఈనెల 28వ తేదీన జగనన్న సంపూర్ణ గృహ హక్కు పథకం సంబంధించి మెగా మేళాను విజయవంతం చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ పి. కోటేశ్వర రావు ఆదేశించారు.గురువారం కలెక్టర్ వారి క్యాంపు కార్యాలయం నుండి జగనన్న సంపూర్ణ గృహ హక్కు పథకం మెగా మేళా పై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ పి కోటేశ్వర రావు టెలీ కాన్ఫరెన్స్ లో సమీక్షించారు.జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వర రావు మాట్లాడుతూ...జగనన్న సంపూర్ణ గృహ హక్కు పథకం మెగా మేళాలో అర్హులైన లబ్ధిదారులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ పథకంలో డబ్బు చెల్లించిన వారికి వెంటనే రుణ విముక్తి ధ్రువీకరణ పత్రం అందజేయాలన్నారు. వన్ టైమ్ సెటిల్మెంట్ (ఓటిఎస్)లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ఈ మెగా మేళాను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు.. క్షేత్రస్థాయిలో తహసీల్దార్ లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు మెగా మేళా విజయవంతం అయ్యేలా పర్యవేక్షించాలన్నారు. నవరత్నాలు పేదలందరికీ ఇల్లు పథకంలో భాగంగా జగనన్న కాలనీలలో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు.టెలీ కాన్ఫరెన్స్ లో జాయింట్ కలెక్టర్ (హౌసింగ్) నారపురెడ్డి మౌర్య, నంద్యాల సబ్ కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్, హౌసింగ్ పిడి వెంకటనారాయణ, ఈఈ నాగరాజు, జెడ్పి సీఈఓ వెంకటసుబ్బయ్య, కర్నూలు, ఆదోని ఆర్ డిఓలు హరిప్రసాద్, రామకృష్ణారెడ్డి, మున్సిపల్ కమిషనర్లు, డిఎల్ డిఓలు, తహసీల్దార్ లు, ఎంపీడీఓలు, తదితరులు పాల్గొన్నారు.

# ఆంధ్ర ప్రదేశ్ రెడ్డి సంక్షేమ సంఘం. పత్రికా ప్రకటన




కర్నూలు బ్యూరో ( విభారె) )జనవరి 27 జిల్లాకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, పెద్దాయన కోట్ల విజయభాస్కర్ రెడ్డి పేరు పెట్టాలని ఆంధ్ర ప్రదేశ్ రెడ్డి సంక్షేమ సంఘం డిమాండ్.కర్నూలు జిల్లాకు మాజీ ముఖ్యమంత్రి, పెద్దాయన కోట్ల విజయభాస్కర్ రెడ్డి పేరు పెట్టాలని, అలాగే అనంతపురం జిల్లాకు కానీ నంద్యాల జిల్లాకు కానీ మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి పేరుపెట్టాలని ఆంధ్ర ప్రదేశ్ రెడ్డి సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిర్రు ప్రతాపరెడ్డి డిమాండ్ చేశారు ఈ సందర్భంగా గురువారం నాడు స్థానిక కర్నూల్ లోని స్కంద బిజినెస్ పార్క్ లో గల వారధి కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో బిర్రు ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కొత్త జిల్లాల ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తూ అలాగే కృష్ణా జిల్లాకు స్వర్గీయ ఎన్టీ రామారావు గారి పేరు ను, గతంలో కడప జిల్లాకు వైయస్ రాజశేఖర్ రెడ్డి గారి పేరు పెట్టడాన్ని ఆంధ్ర ప్రదేశ్ రెడ్డి సంక్షేమ సంఘం స్వాగతిస్తూ అలాగే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో నీతికి నిజాయితీకి నిలువెత్తు నిదర్శనం అయిటువంటి మాజీ ముఖ్యమంత్రి కర్నూలు జిల్లా వాసి కోట్ల విజయభాస్కర్ రెడ్డి పేరు కూడా కర్నూలు జిల్లాకు పెట్టాలని అలాగే అనంతపురం నివాసి అయినటువంటి మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి పేరును అనంతపురం జిల్లాకు కానీ నంద్యాల జిల్లా కు కాని పేరు పెట్టాలని ఆంధ్ర ప్రదేశ్ రెడ్డి సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నది. మాజీ ముఖ్యమంత్రులను గౌరవించడం మంచి సంప్రదాయమని ఇందులో భాగంగా పెద్దాయన కోట్ల విజయభాస్కర్ రెడ్డి పేరును కర్నూలు జిల్లాకు పెట్టాలని గత ఐదు సంవత్సరాలుగా ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ అధికారులకు విన్నవించడం జరిగిందని బిర్రు ప్రతాప రెడ్డి తెలిపారు. మీడియా సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంక్షేమ సంఘం కర్నూలు జిల్లా కార్యదర్శులు సిద్ధం రాజారెడ్డి, సి.బి ఆదిత్య రెడ్డి, కర్నూల్ నగర వర్కింగ్ ప్రెసిడెంట్ ఇన్నెం రజనీకాంత్ రెడ్డి, కర్నూలు జిల్లా యువజన అధ్యక్షులు ధార హరినాద్ రెడ్డి, యువజన విభాగం నాయకులు తిమ్మారెడ్డి, హరినాథ్ రెడ్డి లు పాల్గొన్నారు

# ఏపీ సేవా పథకం ని ప్రారంభించిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి




**:-సచివాలయాల ద్వారా మరింత వేగంగా సేవలు**

**:-జాయింట్ కలెక్టర్ (అభివృద్ధి) డా.మనజీర్ జిలానీ సామూన్**

కర్నూలు, జనవరి 27 ( విభారె) :-సచివాలయాల వ్యవస్థ ద్వారా పరిపాలనను ప్రజలకు చేరువ చేసి మరింత వేగంగా, పారదర్శకంగా సేవలు అందించేందుకు సరికొత్త విధానానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. గురువారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుండి గ్రామ, వార్డు వలింటర్లు సచివాలయాల శాఖ ఏపీ సేవ పోర్టల్ ను రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. జాయింట్ కలెక్టర్ (అభివృద్ధి) డా.మనజీర్ జిలానీ సామూన్ మాట్లాడుతూ....అర్జీదారుడు అర్జీ పరిష్కారానికి సంబంధించి దరఖాస్తు ఎప్పుడు, ఏ అధికారి వద్ద ఏ దశలో ఉందన్న వివరాలను దరఖాస్తుదారుడికి ఎప్పటికప్పుడు ఎస్సెమ్మెస్ రూపంలో తెలియజేసే ప్రక్రియకు సంబంధించి ఏపీ సేవ పోర్టల్ ని రాష్ట్ర ముఖ్యమంత్రి లాంఛనంగా ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. గ్రామ/వార్డు సచివాలయ సేవలను మరింత మెరుగుపర్చేందుకు కృషిచేస్తున్నాం అన్నారు. మారుమూల గ్రామాలకు కూడా మరింత వేగంగా సేవలు అందుతున్నాయని అన్నారు. స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జాయింట్ కలెక్టర్ (అభివృద్ధి) డా.మనజీర్ జిలానీ సామూన్, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, జెడ్పి సిఈఓ వెంకటసుబ్బయ్య, డిప్యూటీ సిఈఓ భాస్కర నాయుడు, గ్రామ, వార్డు సచివాలయాల శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# క్రైసిస్ లోనూ రెండు బ్లాక్ బస్టర్లు ఆయన ఖాతాలో!



ఇండస్ట్రీలో సుదీర్ఘ అనుభవం మాస్టర్ మైండ్ క్వాలిటీస్ కొందరికే సొంతం. కరోనా క్రైసిస్ లోనూ లాభాలు ఘడించడమెలానో కొందరికే తెలుసు. దిల్ రాజు తెలివైన నిర్మాతనే కాదు అంతకు మించి గొప్ప డిస్ట్రిబ్యూటర్. పంపిణీదారుడిగా ఆయన నష్టాలు చూసింది చాలా తక్కువ సందర్భాల్లోనే. టాలీవుడ్ లో అగ్ర నిర్మాతగా కొనసాగుతున్నా...ఆయన ఇంకా డిస్ట్రిబ్యూషన్ మాత్రం వదిలిపెట్టలేదు. నైజాం..వైజాగ్ ఏరియాల్లో ఆయన స్వయంగా సినిమాల్ని రిలీజ్ చేస్తారు. తన సొంత సినిమాలతో పాటు.. బయట బ్యానర్ల సినిమాల్ని సైతం రిలీజ్ చేసి సక్సెస్ అందుకోవడం రాజుగారి ప్రత్యేకత. పంపిణీ రంగంలో రాజుగారిది అందవేసిన చేయి. ఆయన పట్టిందల్లా బంగారమే. మధ్యలో ఒడిదుడుకులు ఎన్ని ఉన్నా తట్టుకునేంత స్థైర్యం.. ఫండింగ్ ఆయనకు ఉన్నాయి. ఇటీవల రిలీజ్ చేసిన 'అఖండ'..'పుష్ప' చిత్రాలు ఆయనకు మంచి లాభాలు తీసుకొచ్చాయి.'అఖండ' నైజాం హక్కుల్ని 10 కోట్లు వెచ్చించారు. ఈ ఒక్క ఏరియా నుంచి 'అఖండ' 20 కోట్ల వరకూ షేర్ తెచ్చింది. ఇక 'పుష్ప' హక్కులకి 36 కోట్లు పెట్టారు. నైజాం షేర్ 40 కోట్లు దాకా వచ్చింది. వాస్తవానికి బాలయ్య ఇమేజ్ నైజాం లో అంతంగా వర్కౌట్ కాదు. కానీ అఖండ ఊహించని వసూళ్లను రాబట్టింది. ఇక్కడ 'పుష్ప' బ్రేక్ ఈవెన్ కూడా కష్టం అనుకున్నారు. పుష్పకు నెగిటివ్ టాక్ వచ్చినా చివరిగా బాక్సాఫీస్ వద్ద వసూళ్ల మోత మోగించింది. మొత్తంగా రెండు సినిమాల ద్వారా రాజుగారు భారీగానే లాభాలు ఆర్జించినట్లు తెలుస్తోంది.ఇలా సాధ్యం కాని సినిమాల్ని కూడా బాక్సాఫీస్ వద్ద సుసాధ్యం చేసి మరోసారి రాజుగారి మార్క్ వేసారు. సూక్ష్మంలో మోక్షం తెలిసిన నిర్మాత ఇందుకేనని అంగీకరించాలి. రాజుగారు తొలుత పంపిణీదారుడిగానే సినిమా రంగంలోకి ఎంటర్ అయిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత నిర్మాతగా ప్రమోట్ అయ్యారు. ప్రస్తుతం దిల్ రాజు భారీ బడ్జెట్ చిత్రాలను నిర్మిస్తున్నారు. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా శంకర్ దర్శకత్వంలో ఓ భారీ బడ్జెట్ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

# పుష్ప 2 పూర్తయాకే బోయపాటికి ఛాన్స్

టాలీవుడ్ లో ఎప్పుడు ఏదైనా జరగొచ్చు. ఒక్కోసారి అనుకున్న ప్రాజెక్ట్ వెంటనే ప్రారంభమైపోతుంది. చాలా సందర్భాల్లో ఆలస్యమైనా అవ్వొచ్చు. అఖండ లాంటి బ్లాక్ బస్టర్ హిట్ ని అందుకున్న బోయపాటి తదుపరి కమిట్ మెంట్ ప్రకారం.. వెంటనే అల్లు అర్జున్ తో సినిమాని ప్రారంభిస్తారనే అంతా భావించారు. కానీ ఇప్పుడు సీన్ మారింది. బోయపాటి సుమారు ఏడెనిమిది నెలల పాటు వెయిట్ చేయాల్సిన సన్నివేశం ఉంటుందని గుసగుసలు వినిపిస్తున్నాయి.అల్లు అర్జున్ పుష్ప - ది రైజ్ తో బ్లాక్ బస్టర్ అందుకున్నారు. 'పుష్ప: ది రూల్'ను ఫిబ్రవరిలో ప్రారంభించి.. ఏప్రిల్ నుండి రెగ్యులర్ చిత్రీకరణను ప్రారంభించాలనే ప్లాన్ తో ఉన్నారు. ఇది బన్ని షెడ్యూల్ లో ఆకస్మిక మార్పు అని తెలిసింది. పుష్ప1 తెలుగు భాషను మించి హిందీ బెల్ట్ లో అనూహ్య విజయం సాధించింది. అందువల్ల బన్ని దీనిని ఎన్ క్యాష్ చేసుకునేందుకు ప్లాన్ ని ఛేంజ్ చేశాడని గుసగుస వినిపిస్తోంది. 'పుష్ప 2'పై తన దృష్టిని సమయాన్ని వెచ్చించాలని భావిస్తున్నాడు. పుష్ప 2ని పూర్తి చేసేవరకు ఎటువంటి కొత్త ప్రాజెక్ట్ లను చేపట్టడు. దీనివల్ల బోయపాటి వేచి చూడాల్సి ఉంటుంది. 'పుష్ప 2'తో దాదాపు 9 నెలలు బిజీగా ఉంటాడు. అంటే బోయపాటి అంతకాలం వేచి చూడాల్సిందే.అఖండ లాంటి బ్లాక్ బస్టర్ తర్వాతా ఇది ఊహించనిది. బోయపాటి కచ్చితంగా వేచి చూడాల్సిందే. అల్లు అర్జున్ - బోయపాటి కాంబినేషన్ లో సరైనోడు బ్లాక్ బస్టర్ హిట్. పైగా బన్ని కెరీర్ బెస్ట్ హిట్ గా నిలిచింది. కానీ ఇప్పుడిలా వేచి చూడాల్సిన సందర్భం వచ్చింది. ఒకవేళ వేచి చూడాల్సిన సన్నివేశంలో బోయపాటి ఏం చేస్తారు? వేరొక స్టార్ తో ముందుకు వెళతారా? అన్నది వేచి చూడాలి.



# టాలీవుడ్ మాస్ దర్శకుడి బాలీవుడ్ డెబ్యూ పరిస్థితేంటి..?

టాలీవుడ్ లో మాస్ అండ్ యాక్షన్ సినిమాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న డైరెక్టర్ వివి వినాయక్. మాస్ ఆడియన్స్ పల్స్ బాగా తెలిసిన వినాయక్.. భారీ యాక్షన్ ఎపిసోడ్స్ - హీరోయిజాన్ని ఎలివేట్ చేసే సీన్స్ తో మెప్పించడంలో సిద్ధహస్తుడు. దాదాపు స్టార్ హీరోలందరికీ సూపర్ హిట్ చిత్రాలను అందించారు. అయితే 'ఇంటలిజెంట్' ఫ్లాప్ తర్వాత వినాయక్ నుంచి మరో మూవీ రాలేదు.కొంతకాలం గ్యాప్ తర్వాత వినాయక్ ఇప్పుడు హిందీ చిత్రాన్ని డైరెక్ట్ చేస్తున్నారు. ఇది దర్శకధీరుడు రాజమౌళి - యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ కాంబోలో వచ్చిన బ్లాక్ బస్టర్ 'ఛత్రపతి' చిత్రాన్ని అధికారిక హిందీ రీమేక్. తెలుగులో ఎన్నో బ్లాక్ బస్టర్స్ అందించిన వి.వి.వినాయక్.. ఈ ప్రాజెక్ట్ తో బాలీవుడ్ లో ఎంటర్ అవుతున్నారు. 'అల్లుడు శీను' తో బెల్లంకొండ సాయి శ్రీనివాస్ ను హీరోని చేసిన అగ్ర దర్శకుడు.. ఇప్పుడు బాలీవుడ్ కు పరిచయం చేసే బాధ్యత తీసుకున్నారు.అప్పుడెప్పుడే సెట్స్ మీదకు వెళ్లిన 'ఛత్రపతి' హిందీ రీమేక్ కరోనా నేపథ్యంలో ఆలస్యమవుతూ వచ్చింది. అయితే తాజా సమాచారం ప్రకారం ఇప్పటికే ఈ సినిమా సంబంధించిన టాకీ పార్ట్ మొత్తం పూర్తి అయిందని తెలుస్తోంది. కేవలం పాటలు మాత్రమే మిగిలి ఉండగా.. మంగళవారం ఒక పాట షూటింగ్ కూడా ప్రారంభమైంది. త్వరలోనే ఈ సినిమా టైటిల్ అనౌన్స్మెంట్ తో పాటు ఫస్ట్ లుక్ ను విడుదల చేయాలని మేకర్స్ భావిస్తున్నారు.ఇంతకముందు 'ఠాగూర్' 'ఖైదీ నెం. 150' వంటి సక్సెస్ ఫుల్ రీమేక్స్ ని తెరకెక్కించిన వినాయక్.. ఇప్పుడు 'ఛత్రపతి' చిత్రాన్ని హిందీ రీమేక్ తో బాలీవుడ్ లో సాలిడ్ ఎంట్రీ ఇస్తారని అభిమానులు భావిస్తున్నారు. హీరో బెల్లంకొండ సైతం ఈ సినిమా తనకు పర్ఫెక్ట్ బాలీవుడ్ లాంచ్ అవుతుందని భావిస్తున్నారు.సాధారణంగా సినిమాలను చాలా ఫాస్ట్ గా తెరకెక్కించే వినాయక్.. ఈ సినిమా కోసం కాస్త ఎక్కువ సమయమే కేటాయిస్తున్నారు.ఒరిజినల్ స్టోరీ రైటర్ రాజమౌళి తండ్రి కె.వి.విజయేంద్ర ప్రసాద్ ఈ హిందీ రీమేక్ వెర్షన్ కు కథ అందిస్తున్నారనే సంగతి తెలిసిందే. హిందీ ప్రేక్షకుల అభిరుచులకు సెన్సిబిలిటీస్ కి అనుగుణంగా స్క్రిప్ట్ లో చాలా మార్పులు చేర్పులు చేశారని తెలుస్తోంది. అయితే దీన్ని మరింత రేసీగా మార్చడానికి దర్శకుడు వివి వినాయక్ సినిమా సెకండాఫ్ లో కొన్ని కీలక మార్పులు చేశారని టాక్ నడుస్తోంది.ఇకపోతే ఇందులో సాయి శ్రీనివాస్ సరసన నటించే హీరోయిన్ ని ఇంకా ప్రకటించలేదు. 'సోనా కే టిటు కీ స్విట్' ఫేమ్ నుస్రత్ బరూచా హీరోయిన్ రోల్ ప్లే చేస్తోందని సమాచారం. పెన్ స్టూడియోస్ - పెన్ మారుధర్ సినీ ఎంటర్టైన్మెంట్ బ్యానర్స్ పై ధవల్ జయంతిలాల్ గడ - అక్షయ్ జయంతిలాల్ గడా భారీ బడ్జెట్ తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. నిజార్ అలీ షఫీ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా.. తనీష్ బాగ్చి సంగీతం సమకూరుస్తున్నారు. మరి 'ఛత్రపతి' రీమేక్ వినాయక్ - బెల్లంకొండ హీరోకి హిందీలో ఎలాంటి ఫలితాన్ని అందిస్తుందో చూడాలి.



# ఏ బాధ్యత అయినా నెరవేరుస్తా.. కెప్టెన్సీ చేయాలని ఎవరు కోరుకోరు: మనసులో మాట చెప్పిన షమీ

టీమిండియా టెస్టు కెప్టెన్ ఎవరు అన్న అంశంపై బీసీసీఐ ఇంతవరకు స్పష్టతనివ్వలేదు. ఈ క్రమంలో ఇప్పటికే రోహిత్ శర్మ, కేఎల్ రాహుల్, జస్‌ప్రీత్ బుమ్రా, రిషభ్ పంత్ వంటి ఆటగాళ్ల పేర్లు వినిపిస్తున్నాయి. మరోవైపు... హిట్‌మ్యాన్ నియామకం ఖాయమే అన్న వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో తాను కూడా ఈ పదవి పట్ల ఆసక్తిగా ఉన్నట్లు టీమిండియా పేసర్ మహ్మద్ షమీ చెప్పకనే చెప్పాడు. కెప్టెన్సీ చేసే అవకాశం వస్తే తప్పక స్వీకరిస్తానని మనసులో మాట బయటపెట్టాడు.కాగా వెస్టిండీస్‌తో స్వదేశంలో వన్డే, టీ20 సిరీస్ నేపథ్యంలో టీమిండియా జట్లను ప్రకటించిన సంగతి తెలిసిందే. పేసర్లు బుమ్రా, షమీకి పని ఒత్తిడి నుంచి విముక్తి కల్పించేందుకు బీసీసీఐ వారిద్దరికి విశ్రాంతినిచ్చింది. ఈ నేపథ్యంలో జాతీయ మీడియాతో మాట్లాడిన షమీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. “అన్ని ఫార్మాట్ల సిరీస్‌ల సెలక్షన్‌కు నేను అందుబాటులో ఉంటాను. నన్ను నేను నిరూపించుకోవాలని భావిస్తున్నాను. ఇక కెప్టెన్సీ విషయం గురించి ప్రస్తుతం నేను ఆలోచించడం లేదు.అయితే, నాకు ఏ బాధ్యత అప్పగించినా సమర్థవంతంగా నెరవేర్చడానికి సిద్ధంగా ఉన్నాను. నిజాయితీగా చెప్పాలంటే... టీమిండియాకు సారథ్యం వహించే అవకాశం వస్తే ఎవరు మాత్రం ఎందుకు వదులుకుంటారు? మరోసారి చెబుతున్నా... నాకు ఏ పని అప్పజెప్పినా కచ్చితంగా వందశాతం న్యాయం చేస్తా” అని షమీ పేర్కొన్నాడు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**